# వర్కింగ్ జర్నలిస్ట్

## సమాచార స్రవంతి

సంపుటి: 14

సంచిక: 09

సెప్టెంబరు 2025

వెల: రూ. 5/-




సమాచార శాఖ

డైరెక్టర్ ప్రఖర్ జైన్



విశాఖపట్నం పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం




ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన



విశాఖపట్నంలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ, ఎస్ఎన్ఎ ఆధ్వర్యంలో సెప్టెంబరు 28న జరిగిన దసరా సంబరాలు



పార్వతీపురం మన్యం జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.ప్రభాకర్ రెడ్డికి అభినందనలుల తెలియజేసిన ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ప్రతినిధులు






## విశాఖ దసరా సంబరాల దృశ్యాలు






# వర్కింగ్ జర్నలిస్ట్ సమాచార స్రవంతి

**సంపుటి: 14 సెప్టెంబరు 2025 సంచిక: 9**


## లోపలి పేజీల్లో...


వృద్ధుల సంక్షేమం కోసం కమిషన్ ......... 4
సుప్రీం ప్రాంగణంలో సోషల్ మీడియా పై ఆంక్షలు ............ 5
నేపాల్‌లో అసలేం జరుగుతోంది? ................ 6
విశాఖలో దసరా సంబరాలు ........................ 12
ముప్పేట దాడిలో మీడియా సమరం ............ 14
ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన .......................... 17
మీడియా కమిషన్ ఏర్పాటు అవసరం ....................... 19
దొందూ దొందే .................... 20
పుంగనూరులో జర్నలిస్టుల ర్యాలీ ---------------- 21
వార్తలు రాయడమే నేరమా? ..................... 22
కాకినాడ ఈనాడు విలేకరిపై దాడి ....... 25
జర్నలిస్టుల హక్కులు - సమస్యల సాధన ...... 27



**సంపాదకులు**

**ఎ.అమరయ్య**

**వర్కింగ్ ఎడిటర్స్**

**ఎన్.కొండయ్య ఎం.ఎ.రవూఫ్**

**సంపాదకవర్గం**

| | |
|---|---|
| జి.ఆంజనేయులు | ఎస్.వెంకట్రావు |
| వి.నవీన్‌రాజ్ | ఎమ్. శ్రీనివాస్ |
| బి.ఎన్.ప్రసాదరావు | వి.గోపి |
| వి.రామారావు | ఆర్.రామాంజనేయులు |
| బి. ఈశ్వరరావు | కె.వేణుగోపాలరావు |
| టి.మద్దులేటి | వి.భక్తవత్సలం |
| ఒ.శాంతి | ఎస్.మురళీశంకర్ |
| కె.ఎస్.శంకరరావు | జి. శీనుబాబు |
| డి.మధుసూదనరావు | |

**డిజైనర్:**



**PUBLISHED, PRINTED AND EDITED BY**
**G. Anjaneyulu on behalf of**
**Andhra Pradesh Working**
**Journalists Federation**
H. No.1-7-9/A, Plot No.40, 402, Surabhi Sapphire, Golconda 'X' Roads, Musheerabad, Hyderabad-500 020, A.P.

**PRINTED AT**
**Prajashakthi,** M.B. Bhavan, Near RTC Cross Roads, Hyderabad-500 020.

**EDITOR**
**A.Amaraiah**
e-mail:editorworkingjournalist@gmail.com,
Cell: 9347921291
RNI No. APMUL/2009/37690


# మాయమవుతున్న వృత్తి ప్రమాణాలు

మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఇతర సిబ్బంది పరిస్థితి ఎంత చెప్పుకున్నా తక్కువే. ఉద్యోగ భద్రత నామమాత్రం. పనిభారం అధికం. పేరుకు జర్నలిస్టుగా ఉన్నా చేయాల్సిన పనులు భిన్నమైనవి. వృత్తి నిర్వహణపై కంటే ఇతర అంశాలపైనే ఎక్కువగా దృష్టి సారించాలి. ప్రకటనలు, ప్రత్యేకించి ధనార్జన. అందుకు ఇచ్చే ప్రాధాన్యం మరి ఏ విషయానికి ఇవ్వాల్సిన పనిలేదు. అదికూడా పోస్ట్‌మాన్ పనిమాత్రమే. మిగిలిన వ్యవహారమంతా యాజమాన్యం లేదా యాజమాన్య ప్రతినిధి చూసుకుంటారు. సమాచార సేకరణ, ప్రజాప్రయోజనం అనే మాటలు కేవలం చెప్పేందుకు మాత్రమేనని వృత్తిలోకి వచ్చిన తక్కువ కాలంలోనే అర్థమవుతుంది. ఎన్నో ఆదర్శాలతో ఈ వృత్తిలో అడుగుపెట్టినవారు అతి తక్కువ కాలంలో ఈ వృత్తి నుంచి నిష్క్రమించి వెళ్లిపోతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నో యేళ్లుగా ఈ వృత్తినే అంటిపెట్టుకుని కొనసాగుతున్నవారు ఈ వృత్తి నుంచి ఇప్పుడు బయటకు వెళ్లలేక తమ విలువలను వదులుకోలేక కొట్టుమిట్టాడుతున్నారు. ఇది ఉద్యోగమో, వృత్తో తెలియని అయోమయ స్థితి. కార్పొరేట్ కంపెనీల ప్రమేయం మీడియా వృత్తిని అతి పెద్ద వ్యాపారంగా మార్చింది. సమాచార విస్ఫోటనం, శాస్త్ర సాంకేతిక ప్రగతిని తమ వ్యాపార పురోభివృద్ధికి మెట్లుగా మార్చుకున్నారు. ఈ వృత్తికి ఉన్న అతి కీలకమైన 'ప్రజాప్రయోజనం' 'సమాజాభివృద్ధి' ని కేవలం నినాదాలకు పరిమితం చేశారు. జరుగుతున్న తప్పులకు మాత్రం జర్నలిస్టులను బాధ్యులను చేస్తున్నారు. సమాజంలో సంభవిస్తున్న పరిణామాలు, వాటి ప్రభావం, అందుకు కారణమైన వ్యక్తులు, శక్తుల ప్రమేయాన్ని దాచేసి కేవలం జర్నలిస్టులు రాసే/ప్రసారం చేసే సమాచారమే కారణమంటున్నారు. మరోపక్క జర్నలిస్టులను భయభ్రాంతం చేసేందుకు రకరకాల ప్రయత్నాలు సాగిస్తున్నారు. తమకు అనుకూలంగా లేని వార్తలకు ఆధారాలేమిటో తెలియజేయమని క్రిమినల్ కేసులు బనాయిస్తున్నారు. భయపెట్టడమే కాదు, ఉసురు తీసేందుకు కూడా వెనకాడ్డం లేదు. వాస్తవాలు రాసేందుకు భయపడే రీతిలో ఉండేవిధంగా దారుణంగా హత్యలు చేస్తున్నారు. చత్తీస్‌గడ్‌లో రోడ్డు నిర్మాణంలో అవినీతిని ప్రశ్నించినందుకు ముఖేష్ చంద్రాకర్ అనే జర్నలిస్టును గుండె పెకలించి, కాలేయాన్ని ఛిద్రం చేసి, పక్కటెముకలు విరిచేసి, మృతదేహాన్ని సెప్టిక్ ట్యాంకులో వేశారు. హత్రాస్ సంఘటనలో సిద్దికి కప్పన్ సుదీర్ఘకాలంలో జైలు జీవితం గడపాల్సి వచ్చింది. ఇదేదో ఒకటి రెండు సంఘటనలు కాదు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అనేకమంది జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది. కార్పొరేట్లు మినుకు మినుకు మంటున్న స్వతంత్ర మీడియాకు మనుగడ లేకుండా చేస్తోంది. వ్యవస్థే జర్నలిజాన్ని రక్షించాలి. జర్నలిస్టులను కాపాడుకోవాలి. మరో ప్రత్యామ్నాయం లేదు.



# జర్నలిస్టుల సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి

విశాఖపట్నం పర్యటనకు సెప్టెంబరు 17న విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కార్యదర్శి గంట్ల శీనుబాబు జర్నలిస్టుల సమస్యలపై వినతిపత్రం అందజేసి పరిష్కరించాలని కోరారు. విమానాశ్రయంలో ఆయనను కలిసి రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న 11 సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రధానంగా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, అక్రిడేషన్ జీవోలో సడలింపులు ఇవ్వాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని, జర్నలిస్టులకు వృద్ధాశ్రమం నిర్మించాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని గంట్ల శ్రీనుబాబు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. జర్నలిస్టుల వినతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించినట్లు గంట్ల శ్రీను బాబు చెప్పారు. జర్నలిస్టులకు ఇంటిస్థలం కేటాయింపునకు సంబంధించి ప్రభుత్వం త్వరలో సానుకూల మైన నిర్ణయం తీసుకుంటుందని ఫెడరేషన్ ఆశాభావంతో ఉన్నదని అన్నారు.

# వృద్ధుల సంక్షేమం కోసం కమిషన్

వృద్ధుల సంక్షేమం కోసం కేరళ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా వృద్ధుల కమిషన్‌ను నియమించింది. ఐదుగురు సభ్యులతో కూడిన కమిషన్ బాధ్యతలు చేపట్టినట్టు ప్రకటించింది. రాజ్యసభ ఎంపీ, కొల్లాం జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షులు, సామాజిక కార్యకర్త కె.సోమప్రసాద్ వృద్ధాప్య కమిషన్ చైర్మెన్‌గా నియమించింది. సభ్యులుగా అమరవిలా రామకృష్ణన్ (సీనియర్ సిటిజన్స్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ), ఇ.ఎం.రాధ (మహిళా కమిషన్ సభ్యురాలు , సామాజిక కార్యకర్త), కెఎన్‌కె నంబూద్రి (రచయిత , సీనియర్ సిటిజన్స్

**దేశంలోనే కేరళలో మొదటిసారి**



సర్వీస్ కౌన్సిల్ వర్కింగ్ ప్రెసిడెంట్) , ప్రొఫెసర్ లోపెజ్ మాథ్యూలు (కాలేజీ మాజీ అధ్యాపకులు, కొట్టాయం జిల్లా పంచాయితీ సభ్యులు, కుసాట్ , ఎంజి విశ్వవిద్యాలయాల సిండికేట్ సభ్యుడు) నియమితులయ్యారు. తిరువనంతపురంలోని సచివాలయంలో కమిషన్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మంత్రి ఆర్.బిందు సమక్షంలో నిర్వహించారు. నిర్లక్ష్యం, దోపిడీ, అనాథలు సహా వృద్ధుల జీవితాల్లో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి పెరుగుతున్న ఆందోళనలను అత్యవసరంగా పరిష్కరించడానికి ఈ కమిషన్ ఏర్పాటు చేసినట్టు మంత్రి ఆర్.బిందు తెలిపారు. వృద్ధుల హక్కులను పరిరక్షించడానికి, పునరావాసాన్ని సులభతరం చేయడానికి, వారి నైపుణ్యాలను ప్రజలకు ఉపయోగపడేలా అవసరమైన కార్యకలాపాలను చేపట్టడానికి ఈ కమిషన్ సహాయపడుతుందని అన్నారు.

# సుప్రీం ప్రాంగణంలో సోషల్ మీడియాపై ఆంక్షలు

వీడియోలపై సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సుప్రీం కోర్టు ప్రధాన ప్రాంగణంలో ఫొటోలు దిగడం, సోషల్ మీడియా రీల్స్, వీడియోలు చేయడాన్ని నిషేధించింది. ఈ మేరకు ఈ ప్రదేశాన్ని హై సెక్యూరిటీ జోన్‌గా గుర్తిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతోపాటు మీడియా ప్రతినిధులు సైతం ఇంటర్వ్యూలు, లైవ్ కోసం వారికి కేటాయించిన చోట సెక్యూరిటీ జోన్ ప్రాంతాన్ని వినియోగించుకోవాలని సూచించింది.

"హై సెక్యూరిటీ జోన్‌లో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోసం మొబైల్ ఫోన్ వినియోగించడం నిషేధం. కెమెరాతో పాటు ట్రైపాడ్, సెల్ఫీ స్టిక్ లాంటి వస్తువులు వాడకూడదు. ముఖ్యంగా రీల్స్, వీడియోలు తీయడం నిషిద్ధం. ఒకవేళ ఈ ఆదేశాలను న్యాయవాది, పిటిషనర్లు, క్లర్క్‌లు, బార్ అసోసియేషన్ సభ్యులు ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు ఉంటాయి. ఒకవేళ ఈ నిబంధనలను ఎవరైనా మీడియా ప్రతినిధి అతిక్రమిస్తే సుప్రీం కోర్టు ప్రధాన ప్రాంగణంలోని హై సెక్యూరిటీ జోన్‌లోకి నెల పాటు ప్రవేశం ఉండదు."

**– సుప్రీంకోర్టు**

ఈ నిబంధనలను ముఖ్యంగా సుప్రీంకోర్టు సిబ్బంది, రిజిస్ట్రీ అతిక్రమిస్తే తీవ్రమైన అంశంగా పరిగణిస్తామని స్పష్టం చేసింది. ఇతర శాఖల సిబ్బంది అతిక్రమిస్తే ఆయా శాఖల నిబంధనల ప్రకారం హెచ్‌ఓడీలు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎవరైనా వ్యక్తులు, సిబ్బంది, న్యాయవాదులు హైసెక్యూరిటీ జోన్‌లో ఫొటోలు తీసుకునే సమయంలో అడ్డుకునే హక్కు భద్రతా అధికారులకు ఉంటుందని చెప్పింది.

'యువ న్యాయవాదులకు అవగాహన కల్పించాలి'

అంతకుముందు సుప్రీం కోర్టు ప్రధాన ప్రాంగణంలో రీల్స్, వీడియోలు తీసివారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది. ముఖ్యంగా అనేక మంది న్యాయవాదులు సుప్రీం కోర్టు ప్రధాన ప్రాంగణం ముందు వీడియోలు నైతిక విలువలను అతిక్రమిస్తున్నారని ఆరోపించింది. కోర్టు రూముల్లో, కారిడార్లు, లాబీలతో పాటు హై సెక్యూరిటీ జోన్లలో రీల్స్, వీడియోలను నిషేధించాలని కోరింది. వీరిని పర్యవేక్షించేందుకు కొందరు పోలీసు అధికారులను నియమించాలని సూచించింది. కోర్టులోని హైసెక్యూరిటీ జోన్‌లో డిస్‌ప్లే బోర్డులను ఏర్పాటు చేయాలని పేర్కొంది. నిబంధనలు అతిక్రమించిన న్యాయవాదులపై చర్యలు తీసుకోవాలని తెలిపింది. లేఖలతో పాటు సభ్యత్వం రద్దు లాంటి చర్యలతో నిబంధనలను రూపొందించాలని చెప్పింది. ముఖ్యంగా యువ న్యాయవాదులకు దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సలహా ఇచ్చింది. సుప్రీంకోర్టు గౌరవం కాపాడాలంటే ఇలాంటి చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ పేర్కొంది.




**దేవరపల్లి నల్లజర్ల గోపాలపురం మండలాలకు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ సమావేశం సెప్టెంబరు 13న దేవరపల్లిలోని యుటిఎఫ్ హాలులో విజయవంతంగా నిర్వహించారు. మూడు మండలాలకు సంబంధించిన ప్రింట్, బ్రాడ్‌కాస్ట్ మీడియాలకు చెందిన జర్నలిస్టులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.**

# నేపాల్‌లో అసలేం జరుగుతోంది?

**"భారత మీడియా నేపాల్‌లో జరుగుతున్న హింసాత్మక నిరసనల సమాచారాన్ని (గత ఆగస్టులో బంగ్లాదేశ్ పౌర సంఘర్షణలో చేసినట్లుగానే) వక్రీకరిస్తోందా?**

**నిజానికి నేపాల్‌లో ఏం జరుగుతోంది? నేపాల్‌లో జరుగుతున్న సంఘటనలపై భారత మీడియా సరైన సమాచారాన్ని అందిస్తోందా?**

**– కాజల్ బసు**

భారతదేశంలోని నా తోటి పొరుగువారికి నమస్కారం. నేను సరిహద్దు దగ్గర నివసిస్తున్న ఒక నేపాల్ పౌరుడ్ని. భౌగోళికంగానే కాకుండా సాంస్కృతికంగా కూడా మన రెండు దేశాలతో అనుసంధానించబడి ఉన్నాను. అందుకే ఇక్కడ నిజంగా ఏమి జరుగుతుందో దాని గురించి మీతో సత్యాన్ని పంచుకోవడం నా కర్తవ్యంగా నేను భావిస్తున్నాను.

నేపాల్ **"సోషల్ మీడియాపై నిషేధానికి వ్యతిరేకంగా జెన్–జడ్ పేరిట జరుగుతున్న సామూహిక నిరసనలు"** ఎదుర్కొంటున్నట్లు చెప్పే ముఖ్యాంశాలను మీరు చూసి ఉండవచ్చు. అది అర్ధసత్యం మాత్రమే.

వాస్తవానికి జరిగిన సంఘటనల క్రమమిది:

– మూడు రోజుల క్రితం, నేపాల్ ప్రభుత్వం అకస్మాత్తుగా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, రెడ్డిట్‌తో సహా 26 సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను నిషేధించింది.

– ఈ నిషేధం రిజిస్ట్రేషన్, పన్నుల గురించి అని వారు పేర్కొన్నారు. కానీ ఈ కంపెనీలు ఇప్పటికే రిజిస్టర్ చేయబడి పన్నులు చెల్లిస్తున్నాయి. అసలు ఉద్దేశ్యం సెన్సార్‌షిప్. ఆన్‌లైన్ సమాచారాన్ని నియంత్రించడానికి, 24 గంటల్లో తమను విమర్శించే పోస్టులను తొలగించడానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడే వారిని జైలులో పెట్టడానికి అధికారం ఇవ్వడం.

– తరువాత రెండు రోజులు దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. సెప్టెంబర్ 8 దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. కానీ అది కేవలం సోషల్ మీడియా గురించి కాదు. సోషల్ మీడియా నిషేధం ఒక నిప్పురవ్వ మాత్రమే.

**మా సహనం నశించింది**

నేపాల్‌లో "నెపో బేబీస్" ధోరణిపై నిరసన పెరిగింది. ఇది రాజకీయ నాయకుల పిల్లల విలాసవంతమైన జీవనశైలిని బహిర్గతం చేసింది. లక్షల విలువైన డిజైనర్లు (బట్టలు, బ్యాగులు, గడియారాలు, ఆహార్యం), లగ్జరీ కార్లు, కోట్లాది రూపాయలు ఖరీదు చేసే ఇళ్ళు, వారాంతపు అంతర్జాతీయ విమాన ప్రయాణాలు, ప్రైవేట్ జెట్‌లు. సాధారణ నేపాలీలు రోజువారీ మనుగడ కోసం కష్టపడుతుండగా నాయకుల పిల్లల జీవనశైలి తీవ్ర విమర్శలకు కారణమైంది. ప్రధానమంత్రి జీతం 65 వేల రూపాయల కంటే తక్కువ కానీ మిలియన్ల డాలర్లలో కూడబెట్టడం ఆ విమర్శలకు తోడైంది.

ఇది ప్రజల మనసును తాకింది. నేపాల్ దశాబ్దాలుగా ఏదో ఒక రకమైన నిరంకుశత్వంలో ఉంది. రాచరికం నుండి ప్రజాస్వామ్యం వైపు సాగే ప్రయాణంలో అవినీతి, అస్థిరత ఎప్పుడూ విడిచిపెట్టలేదు. గడిచిన ఇరవైయేళ్ల కాలంలో ఏ ఒక్క ప్రధానమంత్రి కూడా పూర్తి పదవీకాలం పూర్తి చేయలేదు.

జెన్–జనరల్ పేరుతో సాగిన నిరసనలు సాగినప్పటికీ వాటిని అందరూ స్వాగతించారు. అయితే అది కేవలం సోషల్ మీడియా నిషేధాన్ని నిరసించడం మాత్రమే కాదు. అవినీతి, బంధుప్రీతి, దౌర్జన్యం, అణచివేత, దశాబ్దాల ద్రోహానికి వ్యతిరేకంగా ఈ ఆందోళనలు జరిగాయి. కేవలం మూడు కోట్ల మంది జనాభా ఉన్న దేశంలో ప్రతిరోజూ దాదాపు ఐదువేల మంది యువకులు ఉపాధి కోసం విదేశాలకు వెళుతున్నారు. ఎందుకంటే ఉద్యోగాలు లేవు, మంచి జీతం లేదు. ఇంట్లో ప్రాథమిక జీవనోపాధి లేదు.

ఆరోజు ఊహించని విషాదం సంభవించింది. నిరసన సమయంలో నేను ఎప్పటికీ మరచిపోలేని సంఘటన చూశాను. ఒక మంత్రి ఆదేశం మేరకు స్కూలు యూనిఫాంలో ఉన్న 15 ఏళ్ల పాఠశాల విద్యార్థి తలలోకి భద్రతా దళాలు తూటాలు కాల్చాయి. ఆ విద్యార్థి ఒక్కరే కాదు, ఇరవై మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది గాయపడ్డారని, నిజమైన సంఖ్యలు దాచబడ్డాయని నివేదికలు చెబుతున్నాయి. నా చేతులకంటిన నెత్తుటి తడి ఆరకముందే

# ప్రఖర్ జైన్‌కు సమాచార శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యత



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ డైరెక్టర్‌గా 2021 బ్యాచ్ ఐఎఎస్ అధికారి ప్రఖర్ జైన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సెప్టెంబరు 19న ఉత్తర్వులు జారీ చేశారు. ప్రఖర్ జైన్ జైన్ సచివాలయంలోని ఆర్.టి.జి.ఎస్. సిఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనను సమాచార శాఖ డైరెక్టర్ బాధ్యతతో పాటు ఎక్స్‌అఫీషియో జాయింట్ సెక్రటరీ బాధ్యత కూడా చూస్తారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫిల్మ్, టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయా సంస్థల నిర్వహణ బాధ్యత ప్రఖర్ జైన్ చూస్తారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసు రద్దు చేయాలి

## చిత్తూరు జిల్లా ఫెడరేషన్ డిమాండ్

చంద్రగిరి నియోజకవర్గంలోని చంద్రగిరి ఆంధ్రజ్యోతి దినపత్రిక రిపోర్టర్ లీలాకృష్ణ, టివి9 రిపోర్టర్ సురేష్, బిగ్ టివి రిపోర్టర్ శంకర్‌ల పై రామచంద్రపురం పోలీసులు పెట్టిన అక్రమ కేసులు వెంటనే ఉపసంహరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు కవరకుంట్ల జయరాజ్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు బి ప్రకాష్, కార్యదర్శి సలీం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు చల్లా జయచంద్ర, కార్యదర్శి నీరజాక్షులు, చిత్తూరు నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఏ కేశవులు బాలసుబ్రమణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రామచంద్రపురంలోని లీలాకృష్ణ తాతలనాటి ఆస్తికి పాసుబుక్ మంజూరు చేయాలని, ఆన్ లైన్‌లో నమోదు చేయాలని రెవెన్యూ అధికారులను కోరారు, మీ ఆస్తి తగాదాల్లో ఉందని రెవిన్యూ అధికారులు కాలయాపన చేశారు. లీలాకృష్ణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ కార్యాలయానికి రమ్మని తాహసిల్దార్ పిలిచారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లు కలవగా అక్కడే ఉన్న ఆర్ఐ లక్ష్మీనారాయణ తనను దూషించాడని తాహసిల్దార్ మధుసుదనరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనపై విచారణ జరపమని తాహసిల్దార్ పోలీసులను కోరారు. అయితే రాజకీయ ఒత్తిళ్లతో అత్యుత్సాహం ప్రదర్శించిన రామచంద్రాపురం పోలీసులు ఏకంగా లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లపై పోలీస్ కేసు నమోదు చేశారు. న్యాయం అడిగిన రిపోర్టర్ లీలాకృష్ణ, సురేష్, శంకర్‌లపై అక్రమ కేసులు పెట్టడాన్ని ఫెడరేషన్ ఖండిస్తోంది. బేషరతుగా పోలీస్ కేసు ఉపసంహరించకపోతే జిల్లా వ్యాప్తంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ ఉద్యమం నిర్వహిస్తుందని హెచ్చరించారు. ఇటీవల కాలంలో జర్నలిస్టులను వార్తలు రాయకుండా బెదిరించేందుకు పలు రకాల ఇతర పద్ధతులను ఎంచుకోవడం పట్ల ఫెడరేషన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ధోరణి ఎదుర్కొనేందుకు సంసిద్ధం కావాలని పిలుపిచ్చింది.

## నేపాల్‌లో ఏం జరుగుతోంది?

**( 6వ పేజీ తరువాయి)**

నేను ఇంటికి చేరుకుని భారత మీడియా ఇస్తున్న తప్పుడు వార్తా కథనాలు చూసి విస్తుపోయాను. ఇదంతా సోషల్ మీడియాపై నిషేధం కారణంగానేనని, నేపాల్ యువత సోషల్ మీడియా ''మత్తు''లో సోలిపోతున్నారని సాగించిన ప్రచారం నాకు కోపం తెప్పించింది, కానీ అది నన్ను ఆశ్చర్యపరచలేదు. మీడియా విషయాలను ఎలా వక్రీకరించగలదో నాకు తెలుసు. అందుకే నేను వాస్తవాన్ని తెలియజేయడం కోసం ఇది రాస్తున్నాను.

## సీనియర్ జర్నలిస్టు రాజీవ్ ప్రతాప్

# మరణంపై విచారణ జరిపించాలి



ఉత్తరకాశీకి చెందిన సీనియర్ జర్నలిస్ట్, యూట్యూబర్ రాజీవ్ ప్రతాప్ మరణంపై తక్షణ విచారణ చెయ్యాలని నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ , కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఢిల్లీ యూనిట్) ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ డిమాండ్ చేస్తున్నాయి.

రాజీవ్ ప్రతాప్ ఈ యేడాది సెప్టెంబర్ 18 రాత్రి నుంచి కనిపించడం లేదు. అతని మృతదేహం పది రోజుల తర్వాత సెప్టెంబర్ 28న జోషియారా బ్యారేజ్‌లో కనిపించింది. ప్రతాప్ ఢిల్లీ ఉత్తరాఖండ్ లైవ్ అనే ఛానెల్‌ను నడిపేవాడు.

అతని భార్య చెప్పిన సమాచారం ప్రకారం, ప్రతాప్ ఉత్తరకాశీలోని జిల్లా ఆసుపత్రి, ఒక స్కూల్ స్థితిపై వీడియోలు అప్‌లోడ్ చేసిన తర్వాత ఆయన్ని చంపుతామని బెదిరింపులు వచ్చాయి. ఆ వీడియోలను తొలగించమని అతనికి హెచ్చరికలు వచ్చాయని ఆమె చెప్పారు. ప్రతాప్ ఒంటరిగా ఆల్టో కారులో స్థానిక రోడ్డుపై రాత్రి పూట ప్రయాణిస్తున్నప్పుడు ఆయనపై దాడి జరిగి వుంటుంది. అయన ప్రయాణిస్తున్న కారు భగీరథి నదిలో దొరికింది. మృతదేహం కొన్ని రోజుల తర్వాత కనబడింది.

మృతదేహాన్ని పోస్ట్ మార్టమ్ కోసం పంపించారు. పోలీసులు కారు ఒక గాడిలో పడి నదిలో పడి ఉండవచ్చని చెబుతున్నారు. ఆయన శరీరంపై ఎటువంటి దాడి జరిగిన ఆనవాళ్లు కనిపించలేదని స్పష్టం చేశారు. ప్రమాదం సంభవించి ఉండవచ్చనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

అయితే, జర్నలిస్ట్ మిస్సింగ్ అయిన పరిస్థితులు అత్యంత అనుమానాస్పదంగా ఉన్నాయి. మిత్రునితో కలిసి ఒక హూటల్ నుంచి బయలుదేరిన రాజీవ్ అంతర్ధానం కావడం, పదిరోజుల పాటు ఆచూకీ తెలియకపోవడం, అతని భార్య అందించిన సమాచారం ప్రకారం ఆయన నడిపే ఛానల్‌లో ప్రసారమైన వార్తలకు సంబంధించి బెదిరింపులు రావడం వల్ల పలు అనుమానాలకు తావిచ్చినట్టయింది.

ఈ సంఘటనపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించాల్సిన అవసరం ఉన్నదని నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు (ఎన్ఎజె), ఢిల్లీ జర్నలిస్టుల సంఘం (డియుజె), ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్), కేరళ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (కెయుడబ్ల్యుజె, ఢిల్లీ యూనిట్)లు భావిస్తున్నాయి. ఈ అనుమానాస్పద మరణంపై పూర్తి విచారణ జరిపించాలని, ఆయన కుటుంబానికి పరిహారాన్ని యివ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. స్థానిక సమస్యలపై రిపోర్టింగ్ చేసే జర్నలిస్టులపై దాడులు, ముఖ్యంగా ఇటువంటి కేసులు ఇటీవల సర్వసాధారణమవుతున్నాయని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలకు గుర్తు చేస్తున్నాం. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, ఆసుపత్రులు, ప్రైవేటు విద్యాసంస్థలకు సంబంధించి ప్రచురితమవుతున్న వార్తల విషయంలో పలు రాష్ట్రాల్లో దాడులు పెరిగాయి. ఛత్తీస్‌గడ్‌లో రోడ్డు కాంట్రాక్టు విషయంలో ప్రచురితమైన వార్త కారణంగానే ముఖేష్ చంద్రాకర్‌ను అత్యంత పాశవికంగా చంపేశారు. మీడియాలో అటువంటి వార్తలు రాయాలంటే భయపెట్టే రీతిలో చంపడమంటే మీడియాను భయపెట్టడమే. ఇటువంటి అన్ని కేసులను నిశిత దృష్టితో పరిశీలించి, బాధ్యులను గుర్తించి, నిందితులను అరెస్ట్ చేసి, శిక్షించాలని ఎన్ఎజె అధ్యక్షులు ఎస్.కె.పాండే, సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య, డియుజె అధ్యక్ష ప్రధానకార్యదర్శులు సుజాత మథోక్, జిగేష్, ఎపిడబ్ల్యుజెఎఫ్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఎస్.వెంకట్రావు, జి.ఆంజనేయులు, కెయుడబ్ల్యుజె ఢిల్లీ యూనిట్ అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ప్రసూన్ కందత్, ధనసుమోద్‌లు డిమాండ్ చేశారు.

# జర్నలిస్టుల ఆరోగ్యబీమా పునరుద్ధరణకు నిధులు

జర్నలిస్టుల హెల్త్ కార్డులు రెన్యువల్‌కు నిధులు మంజూరు చేస్తూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ప్రకటించడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. ఈశ్వరరావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హెల్త్ కార్డుల రెన్యువల్‌కు నిధులు మంజూరు చేయాలంటూ జిల్లా అధ్యక్షులు బి. వెంకటేష్ ఆధ్వర్యంలో అనకాపల్లి జర్నలిస్టులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారని తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సీఎస్ఆర్ నిధులు విశాఖ జిల్లా కలెక్టర్ మంజూరు చేయడంతో ఫెడరేషన్ నాయకులు మరోసారి జిల్లా కలెక్టర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. జర్నలిస్టులు ఆరోగ్యబీమా కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ



## ఫలించిన ఫెడరేషన్ పోరాటం

ఫెడరేషన్ అనకాపల్లి జిల్లా శాఖ అధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి కోరారు. ఫెడరేషన్ అభ్యర్ధన పరిశీలించిన కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య పథకం రెన్యువల్ కొరకు మూడు లక్షల ఏభై ఐదు వేల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో సెప్టెంబర్ 2025 నెలలో రెన్యువల్ చేసుకున్న అక్రిడిటేషన్ స్లిప్ కలిగి ఉన్న జర్నలిస్టులు జిల్లా సమాచార పౌర సంబందాల అధికారి కార్యాలయంలో వారి వివరాలు అందజేసి హెల్త్ కార్డులు రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

## దూరదర్శన్ డిడి తారక ప్రసాద్

విజయవాడ కేంద్రం ప్రాంతీయ వార్త విభాగం సహాయ సంచాలకునిగా భగాతి తారక ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. తారక ప్రసాద్ ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్ అధికారిగా 2000 నుంచి కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలో వివిధ హెూదాల్లో పనిచేశారు. ఆకాశవాణి న్యూఢిల్లీ న్యూస్ సర్వీసెస్ డివిజన్‌లో సహాయ సంచారకుడిగా పనిచేస్తూ విజయవాడ దూరదర్శన్‌కు బదిలీపై వచ్చారు. గతంలో నెల్లూరు, శ్రీకాకుళం జిల్లాల్లో ఫీల్డ్ పబ్లిసిటీ అధికారిగా పనిచేశారు. ఆయనకు దూరదర్శన్ ప్రాంతీయ వార్త విభాగం అధిపతి షఫీ మహమ్మద్ ఐఐఎస్ దూరదర్శన్ సిబ్బంది స్వాగతం పలికారు.

## జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డు రద్దు

పెద్దపల్లి జిల్లాలో ఒక జర్నలిస్టు అక్రిడిటేషన్‌ను కలెక్టర్ రద్దు చేశారు. ఒక పత్రిక పేరిట కార్డు తీసుకుని మరో పత్రికకు పనిచేస్తూ తప్పుడు వార్తలు రాస్తున్నాడనే అరోపణతో జర్నలిస్టు అక్రిడిటేషన్ కార్డు రద్దు చేయడం జరిగిందని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. నమస్తే తెలంగాణ దినపత్రిక నుంచి ముత్తారం మండలానికి అక్రిడేషన్ కార్డు పొందిన కె. మల్లేష్ యాదవ్ విజయ క్రాంతి దినపత్రికకు పనిచేస్తున్నట్లు తెలిసింది. ఆగస్టు 26న సదరు జర్నలిస్టు విజయ క్రాంతి దినపత్రికలో రాసిన ఖమ్మంపల్లి టు హైదరాబాద్ అక్రమ మట్టి రవాణా కోట్లు సంపాదిస్తున్న స్థానిక నాయకులు అనే వార్తపై నివేదిక తెప్పించుకోవడం జరిగిందన్నారు. అక్రిడిటేషన్ నిబంధనల ప్రకారం ఒక సంస్థ నుంచి అక్రిడిటేషన్ కార్డు పొంది వేరే సంస్థకు మారిన నేపథ్యంలో అక్రిడేషన్ రద్దు అవుతుందని ఆయన తెలియజేశారు.

## సిరిసిల్ల డిపిఆర్ఓ సస్పెన్షన్

రాజన్న సిరిసిల్ల జిల్లా పౌర సంబంధాల అధికారి వి.శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సెప్టెంబరు 26వ తేదీ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా ప్రభుత్వ అధికారుల వాట్సప్ గ్రూప్‌లో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌పై ఒక పత్రికలో వచ్చిన వ్యంగ్యకార్టూన్‌ను డిపిఆర్ఓ వైరల్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా కార్టూన్ డిపిఆర్ఓ వైరల్ చేశారని ఆగ్రహానికి గురైన కలెక్టర్ శ్రీధర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా తన అనుమతి లేకుండా జిల్లా కేంద్రం దాటిపోరాదని ఆదేశించారు.

శ్రీరస్తు శుభమస్తు అవిఘ్నమస్తు

"స్వయంభు"

# శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానము

కాణిపాకం, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

స్వస్తిశ్రీ శ్రీ విశ్వావసు నామ సంవత్సర బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక

## బ్రహ్మోత్సవములు : 27-08-2025 నుండి 16-09-2025 వరకు

**" శ్రీ మహా గణాధిపతయే నమః"**



శ్లో॥ సర్వ విఘ్నహరం దేవం సర్వ విఘ్న వివర్జితమ్ !
సర్వ సిద్ధి ప్రదాతారం వందేహం గణనాయకమ్ !!

భక్తులారా !!

చరాచర జగత్తు నందు సృష్టి స్థితి లయంబు లొనరిస్తూ ముల్లోకములకు అధిపతియైనటువంటి శ్రీ మహాగణపతి ముప్పై మూడు కోట్ల దేవతలలోనూ ప్రథమారాధ్యుడు అనగా ప్రప్రథమముగా ఆరాధింప తగిన అగ్రపూజ్యుడు, ఏ పని మొదలు పెట్టినా ఆ పనిని నిర్విఘ్నంగా, విజయవంతంగా నెరవేరటానికి మొదటగా గణపతిని పూజించి మొదలు పెట్టడం సంప్రదాయం మరియు ఆనవాయితీ. సకల విధ భక్తకోటికి కోరిన వెంటనే సత్వరం కోర్కెలు తీర్చే వరసిద్ధి వినాయకుడు సమస్త విఘ్నములనూ హరింప చేసే విఘ్నేశ్వరుడు సమస్త విద్యలనూ ప్రసాదించే విద్యాగణపతి, అష్టైశ్వర్యములనూ అనుగ్రహించే లక్ష్మీ గణపతి అయినటువంటి శ్రీ వినాయక స్వామివారు కాణిపాక క్షేత్రము నందు భక్తులమనోభీష్టములు నెరవేర్చుటకు స్వయంభువుగా ఉద్భవించి "స్వయంభు" శ్రీ వరసిద్ధి వినాయకుడుగా పిలవబడుచున్నారు. శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారికి ప్రతి సంవత్సరము వినాయక చవితి మొదలు 21 రోజులు బ్రహ్మోత్సవములు అంగరంగ వైభవముగా నిర్వహించబడును.

సదరు వినాయక చవితి వార్షిక బ్రహ్మోత్సవములలో భాగంగా ఈ సంవత్సరము అనగా స్వస్తిశ్రీ శ్రీ విశ్వావసు నామ సంవత్సర భాద్రపద శుద్ధ చతుర్థి 'వినాయక చవితి' మొదలు 21 రోజులు అనగా తేది. 27-08-2025 బుధవారం రోజున శ్రీకాణిపాక విఘ్నేశ్వర యువజన సంఘం వారిచే పుష్పకావళ్ళు సమర్పణతో ప్రారంభమై తేది. 16-09-2025 మంగళవారం తెప్పోత్సవముతో ముగియును. ఈ విధముగా స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవములు మరియు ప్రత్యేక ఉత్సవములు అంగరంగ వైభవముగా నిర్వహించుటకు శ్రీ భగవదాజ్ఞ అయినది. కావున శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమములు దేవస్థానము మరియు ఉభయదారులు వారిచే ఈ క్రింది విధముగా నిర్వహించబడును.

| తేది | వారము | జరుగు కాలము | ఉత్సవ వివరములు | ఉభయదారులు |
|---|---|---|---|---|
| 27-08-2025 | బుధవారము వినాయక చవితి | ఉదయం<br>రాత్రి | అభిషేకం<br>గ్రామోత్సవము | శ్రీ గాలి మునస్వామి నాయుడు, కాకర్లవారిపల్లె వారిచే |
| | | సాయంత్రం | పుష్పకావళ్ళు సమర్పణ | శ్రీకాణిపాక విఘ్నేశ్వర యువజన సంఘం వారిచే |
| 28-08-2025 | గురువారము | ఉదయం | ధ్వజారోహణము<br>స్వాతి నక్షత్రయుక్త శుభ తులా లగ్న మందు ఉ॥ 9.30 నుండి 10.10 గం॥ల మధ్య | దేవస్థానం వారిచే |
| | | ఉదయం | అభిషేకం | కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణం పల్లె, గ్రామాదుల శీర్‌కరుణీక వంశస్థులు. |
| | | రాత్రి | హంస వాహనము | |
| 29-08-2025 | శుక్రవారము | ఉదయం | అభిషేకం<br>నెమలి వాహనము | కాణిపాకం, చినకాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె అగరంపల్లె, వడ్రాంపల్లె, దామరగుంట, కురప్పల్లి, గ్రామాదుల రెడ్డి వంశస్థులు. |
| | | రాత్రి | బంగారు నెమలి వాహనము | |
| 30-08-2025 | శనివారము | ఉదయం | అభిషేకం | కాణిపాకం, తిరువణంపల్లె, అగరంపల్లె, కాణిపాక పట్నం, వడ్రాంపల్లె, కొత్తపల్లె, చినకాంపల్లె గ్రామాదుల విశ్వకర్మ వంశస్థులు. |
| | | రాత్రి | మూషిక వాహనము | |

| | | | | |
|---|---|---|---|---|
| 10-09-2025 | బుధవారము | ఉదయం<br>రాత్రి | **అభిషేకం**<br>**చంద్రప్రభ వాహనము** | కాణిపాకం, చినకాంపల్లె, పద్రాంపల్లె, కొత్తపల్లె, చిగరపల్లె, తిరువణంపల్లె, 44 బొమ్మసముద్రం, అగరంపల్లె, పుణ్యసముద్రం, ఎగువ మారేడుపల్లె, దిగువ మారేడుపల్లె, సంతపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లె, కారకాంపల్లె, కాణిపాకపట్నం, పైపల్లె, సిద్ధంపల్లె గ్రామాదుల హరిజన వంశస్థులు |
| 11-09-2025 | గురువారము | ఉదయం<br>రాత్రి | **అభిషేకం**<br>**కల్పవృక్ష వాహనము** | దేవస్థానం కార్యనిర్వహణాధికారి<br>అర్చకులు, వేదపండితులు<br>మరియు దేవస్థాన సిబ్బంది |
| 12-09-2025 | శుక్రవారము | ఉదయం<br>రాత్రి | **అభిషేకం**<br>**విమానోత్సవము** | కీ॥శే॥ కె. రామకృష్ణపిళ్ళై వారి కుమారుడు<br>శ్రీ కె.ఆర్. గణపతి మరియు కుటుంబ సభ్యులు, విరాల<br>మరియు దేవస్థానం వారు |
| 13-09-2025 | శనివారము | ఉదయం<br>రాత్రి | **అభిషేకం**<br>**పుష్ప పల్లకి సేవ** | శ్రీమతి కె. భాగ్యలక్ష్మమ్మ, చిగరపల్లె.<br>కీ॥శే॥ ఎస్. దామోదరనాయుడు మరియు<br>కుటుంబ సభ్యులు, కాకర్లవారిపల్లె.<br>శ్రీ కె. మోహన్ నాయుడు & బ్రదర్స్, తిరువణంపల్లె.<br>శ్రీ వి.టి. రాజన్ & బ్రదర్స్, తిరువణంపల్లె.<br>శ్రీ ఎమ్. రామనాథం నాయుడు, తిరువణంపల్లె.<br>కీ॥శే॥ ఎమ్. రాజారెడ్డి, అగరంపల్లె.<br>కీ॥శే॥ జి. క్రిష్ణమనాయుడు & సన్స్, అడపగుండ్లపల్లె.<br>శ్రీ ఎ. నరసింహారెడ్డి & సన్స్, అగరంపల్లె.<br>కీ॥శే॥ శ్రీ యం. శ్రీరాములు రెడ్డి, అగరంపల్లె.<br>కీ॥శే॥ శ్రీ యం. బాలక్రిష్ణా రెడ్డి & కో, చిత్తూరు.<br>శ్రీ జి. శేషయ్యనాయుడు & సన్స్, చిత్తూరు<br>శ్రీ బి. కుమరేంద్ర చౌదరి, సి.ఎ., చిత్తూరు.<br>శ్రీ ఎమ్. మనోహర్ నాయుడు & బ్రదర్స్, అడపగుండ్లపల్లె<br>శ్రీ జి. అంజనేయులు నాయుడు & సన్స్, చింతగుంపలపల్లె |
| 14-09-2025 | ఆదివారము | ఉదయం<br>రాత్రి | **అభిషేకం**<br>**కామధేను వాహనము** | నాయీబ్రాహ్మణ వంశస్థులు, కాణిపాకం |
| 15-09-2025 | సోమవారము | ఉదయం<br>రాత్రి | **అభిషేకం**<br>**పూలంగి సేవ** | కీ॥శే॥ రాజమాణిక్యం నాయుడు & సన్స్, వేలూరు<br>శ్రీ కె. రాధాకృష్ణన్, కాణిపాకం |
| 16-09-2025 | మంగళవారము | ఉదయం<br>రాత్రి | **అభిషేకం**<br>**తెప్పోత్సవం** | కీ॥శే॥ శ్రీ గాలి పుండరీక నాయుడు, వారి కుమారుడు<br>శ్రీ గాలి శేషాచలం నాయుడు, కాకర్లవారిపల్లె<br>కీ॥శే॥ శ్రీ ఆర్. శేషాద్రి నాయుడు & బ్రదర్స్, కాకర్లవారిపల్లె<br>కీ॥శే॥ శ్రీ జి. హనుమంతు నాయుడు వారి కుమారులు, అడపగుండ్లపల్లె<br>కీ॥శే॥ శ్రీ యం. రామక్రిష్ణారెడ్డి వారి కుమారుడు శ్రీ యం.జగన్నాథ రెడ్డి, కాణిపాకం<br>శ్రీ గురజాల దామోదరనాయుడు, కొత్తపల్లె<br>కీ॥శే॥ చల్లగుండ్ల దామోదరనాయుడు వారి కుమారులు, కాకర్లవారిపల్లె<br>శ్రీ గురజాల ఆనంద నాయుడు, & బ్రదర్స్, దిగువ మారేడు పల్లె<br>శ్రీ లంకిపల్లి మోహన్‌బాబు, 44 బొమ్మసముద్రం |

గమనిక :

1. 07.09.25 న చంద్రగ్రహణం కారణముగా మధ్యాహ్నం 3 గ॥ల నుండి ఆలయము మూసివేయబడును. ది 08.09.25 న ఉదయం 4 గ॥ల నుండి యథాప్రకారముగా పూజాదికములు ప్రారంభమగును.
2. 27-08-2025 నుండి 16-09-2025 వరకు శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవ కాలమందు యాగశాల ఖర్చులు బేరి మంగమ్మ ఛారిటీ మరియు దేవస్థానము వారిచే నిర్వహించబడును.
3. 27-08-2025 నుండి 16-09-2025 వరకు దేవస్థానము నందు అభిషేకములు, ప్రమాణములు రద్దు చేయడమైనది. ఉభయదారులచే జరిపించబడు అభిషేక సమయం మినహా మిగిలిన సమయములలో యథాతథముగా భక్తులను దర్శనమునకు అనుమతించుట జరుగును.
4. భక్తులు శ్రీ స్వామివారికి ముడుపులు, కానుకలు చెల్లించదలచిన వారు దేవస్థానము హుండీలలో సమర్పించవలెను. లేదా దేవస్థానము విరాళ కేంద్రములందు చెల్లించి రశీదు పొందవలెను.
5. గణేశ మండల దీక్ష మాలాధారణలు శ్రావణ శుద్ధ త్రయోదశి 07-08-2025 గురువారము నుండి ప్రారంభమగును.
6. తేది: 27-08-2025 నుండి 16-09-2025 వరకు దేవస్థానములో జరుగు అన్ని ఉత్సవములను srikanipakadevasthana ద్వారా వీక్షించవచ్చును. కార్యాలయ ఫోన్ నెంబరు: 08573-281540, 281747

**గణేశ మాలధారణ / గణేశ దీక్ష :** "స్వయంభు" శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి క్షేత్రంలో ప్రప్రథమంగా 2005 సం॥ లో వినాయక చవితి రోజున ప్రారంభించబడినది. 2025వ సం॥ **వినాయక మాలాధారణలు** అర్ధ మండల దీక్ష తేది. 27-08-2025 న దీక్ష ప్రారంభించబడుచున్నవి. వివరములకు ఈ క్రింది ఫోన్ నెంబర్ల నందు సంప్రదించవచ్చును.
ఫోన్ : (యస్.టి.డి. : 08573) విచారణ కార్యాలయం : 281540, 281747



# విశాఖలో వైభవంగా జర్నలిస్టుల దసరా సంబరాలు



రాష్ట్రంలో ప్రజలందరి పైన ఆదిపరాశక్తి దుర్గాదేవి ఆశీస్సులు ఉండాలని.. ప్రతి ఒక్కరు ఆ జగన్మాత కరుణ కటాక్షాలతో సుభిక్షంగా ఉండాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రముఖ సామాజిక ఉద్యమకారులు బొలిశెట్టి సత్యనారాయణ ఆకాంక్షించారు. సెప్టెంబరు 28న సింకా గ్రాండ్ లో ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జర్నలిస్టుల దసరా సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బొలిశెట్టి మాట్లాడుతూ నిరంతరం పని ఒత్తిడిలో ఉండే జర్నలిస్టులకు ఆటవిడుపుగా దసరా సంబరాలు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారానికి కూటమి ప్రభుత్వం దృష్టి సారించాల్సిందేనన్నారు. ఇందుకోసం తనవంతు సహకారం అందిస్తానని, అవసరం అయితే వారితో కలిసి ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి అయినా తాను సిద్ధమేనన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్యదర్శి గంగవరపు ఆంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి నిబద్ధతతో కట్టుబడి గట్టిగా కృషి చేస్తామని పునరుద్ఘాటించారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వాలు పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదని, ఇలా అయితే సమీప భవిష్యత్తులో జర్నలిస్టుల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం పొంచి ఉందన్నారు. దేశంలోని పలు ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో జర్నలిస్టుల సంక్షేమానికి మంచి ప్రాధాన్యత నిస్తూ జర్నలిస్టు వృత్తిని బాగా ప్రోత్సహిస్తున్నారన్నారు. కానీ మన రాష్ట్రంలో పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉందని ఆయన విచారం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కయిన అక్రిడిటేషన్ కార్డుల సాధనే జర్నలిస్టులకు తలకు మించిన భారంగా పరిణమించిన విపత్కర పరిస్థితుల్లో జర్నలిస్టుల సంక్షేమం కోసం పోరాడటమంటే కత్తి మీద సామేనని తమకు తెలుసునని, అయినా జర్నలిస్టుల సంక్షేమం కోసం గట్టిగా కృషి చేస్తామని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు త్వరలోనే విజయవాడ వేదికగా చలో విజయవాడ కార్యక్రమం జర్నలిస్టులతో నిర్వహించే ఆలోచన చేస్తున్నట్టు చెప్పారు. దసరా సంబరాల కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు విశాఖ జిల్లా అధ్యక్షులు పి నారాయణలు మాట్లాడుతూ సమాజంలోని విభిన్న వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల వద్దకు వచ్చే సరికి మాత్రం మొండి చెయ్యి చూపుతున్నాయన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, వృత్తి నుంచి రిటైరైన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టులకు హెల్త్ కార్డులు మంజూరు చెయ్యాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ఇప్పటికే ప్రభుత్వ పెద్దలకు, కూటమి నాయకులకు, అధికారులకు ఇచ్చామని ఇంకా దశల వారీగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రతి యేటి మాదిరిగానే దసరా పర్వదిన వేడుకలను ఈ ఏడాది కూడా అత్యంత వైభవంగా నిర్వహించామన్నారు.

ఈ కార్యక్రమంలో నృత్య భారతి డాన్స్ స్కూల్ అసోసియేషన్ అధినేత్రి కనక మహాలక్ష్మి ఆధ్వర్యంలో ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరింప చేశాయి.

వెంకటేశ్వర వైభోగం, నవదుర్గల మహత్యం తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా అలరించాయి.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన మహిళలకు చీరలు, పిల్లలకు రకరకాల బహుమతులు, మిఠాయిలు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హైదర్ ఆలీ సింకా, ఏపీడబ్ల్యూజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి ఈశ్వరరావు, ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసరావు, బ్రాడ్ కాస్ట్ అధ్యక్ష కార్యదర్శులు ఈరోతి ఈశ్వర రావు, మదన్, స్మాల్ పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్, ఫెడరేషన్ డిప్యూటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఏ. సాంబశివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డి..రవికుమార్, ఉ





పాధ్యక్షులు బండారు శివప్రసాద్, పక్కివేణు, నారాయణరాజుతో పాటు అసోసియేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు. సింకా గ్రాండ్ హూటల్ యజమాని, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సింకా కార్యక్రమానికి విచ్చేసి తమ అండదండలు అహర్నిశలూ జర్నలిస్టులకు ఉంటాయని హామీ ఇచ్చారు.



**విజయవంతం చేసేందుకు విశేష కృషి**

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, బ్రాడ్ కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 28న జర్నలిస్టుల దసరా సంబరాలు ఘనంగా జరిగేందుకు మొత్తంగా జిల్లా కమిటీ చాలా శ్రమించింది. ఈ ఉత్సవాల నిర్వహణ నిమిత్తం సెప్టెంబరు 11న, 25న రెండుసార్లు కార్యవర్గ సమావేశాలు జరిగాయి. ఉత్సవాల నిర్వహణ ఏ విధంగా జరగాలనే అంశంపై సవివరంగా సమావేశంలో చర్చించి బాధ్యతలు అప్పగించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల బహుమతులు పంపిణీకి వీలుగా ఆయా ప్రాంతాలకు బాధ్యతలను అప్పగించి జిల్లా కమిటీ సారధ్యంలో రాష్ట్ర కార్యదర్శి గంట్ల శీనుబాబు నేతృత్వంలో విజయవంతంగా దసరా సంబరాలను నిర్వహించారు.

# రవికుమార్‌కు ఎక్స్ రే అవార్డు ప్రదానం

సీనియర్ జర్నలిస్టు, కవి, రచయిత ధవళేశ్వరపు రవికుమార్‌కు ఎక్స్ రే అవార్డును విజయవాడలో ఆగస్టు 30న ప్రదానం చేశారు. అత్యంత ఘనంగా నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో రవికుమార్‌కు ఈ పురస్కారాన్ని పూర్వ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్, డిప్యూటీ కలెక్టర్ కొమ్మెర్ల కృష్ణవేణి, ఎక్స్ రే అధ్యక్షులు కొల్లూరు శ్రీశ్రీ కళానిధి కన్వీనర్ ఎస్.అశోక్ కుమార్ తదితరులు అందజేశారు. ఎక్స్ రే సంస్థ జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో ఉత్తమ కవితా అవార్డుకు రవికుమార్ రాసిన స్వేచ్ఛా జగతికి.. ఎంపికైంది. 44 సంవత్సరాలుగా ఎక్స్ రే సంస్థ జాతీయ స్థాయి అవార్డులను ప్రదానం చేస్తోంది. తెలుగు కవులు ఎక్స్ రే అవార్డును అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తారు. ఈ ఏడాది నిర్వహించిన పోటీలో వందలాది కవితల వడపోత తరువాత అవార్డుతోపాటు ఉత్తమ కవితా పురస్కారాల కోసం విజేతలను ఎంపిక చేశారు. రవికుమార్ రాసిన స్వేచ్ఛా జగతికి కవిత ఉత్తమ కవితా పురస్కారాన్ని దక్కించుకుంది. హైదరాబాద్‌కు చెందిన సాహితీ వేత్త సర్వజిత్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. రవికుమార్ ప్రతిష్టాత్మకమైన ఎక్స్ రే పురస్కారం అందుకున్న సందర్భంగా పలువురు పాత్రికేయులు, సాహితి మిత్రులు రవికుమార్‌ను అభినందించారు.

# ముప్పేట దాడిలో మీడియా సమరం



**తెలకపల్లి రవి**

ప్రపంచవ్యాప్తంగా యాభై దేశాల్లో రెండువందల మీడియా సంస్థలు సెప్టెంబరు మొదటి తేదీన అంతకు ముందున్నడూ లేని రీతిలో నిరసన తెలిపాయి. మొదటి పేజీని నిరసనత్మకంగా ప్రచురించి గాజాలో వరుసగా జర్నలిస్టులపై హత్యాకాండను అణిచివేతను దృష్టికి తెచ్చాయి. ఇజ్రాయిల్–అమెరికా కూటమి కుట్రలకు బలైన గాజాలోనే కాదు ప్రపంచ మంతటా కూడా మీడియా ఇదే విధమైన దాడులకు, దౌర్జన్యాలకు గురవుతున్నది. మీడియా స్వభావం అనేక కొత్త రూపాల్లోకి మారిన నేపథ్యంలో అవన్నీ కూడా ఈ దాడికి నలిగిపోతుండడం ఇప్పటి ప్రత్యేక సవాలు. నిజానికి ఇది ప్రజాస్వామ్య సూత్రాలకే పెద్ద ముప్పు. అమెరికా నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వరకు ప్రతి చోటా ఇదే పరిస్థితి. భారతదేశంలో సంఘపరివార్‌తో పాటు మోడీ ప్రభుత్వం ప్రత్యక్షంగాను భావజాలపరంగాను విమర్శకులపై దాడికి దిగుతుంటాయి. తెలుగు రాష్ట్రాల్లో పాలకులు, ప్రధాన పాలక పార్టీలూ విమర్శించే మీడియాను ఆడిపోసుకొని రోజు ఉండడం లేదు. ఇది కాక సినీ. సాంస్కృతిక రంగాలకు సంబంధించి కూడా కార్పొరేట్ పడగ నీడన ప్రగతి నిరోధక శక్తులు మీడియాను వేటాడుతున్నాయి. ఈ దాడిని మూడు రకాలుగా చూడొచ్చు. మొదటిది–అధికారంతో రాజకీయ ప్రాబల్యంతో, రెండు అభివృద్ధి నిరోధక ఫాసిస్టు తరహా భావజాలంతో, మూడు కార్పొరేట్ యాజమాన్య పద్ధతులు ప్రలోభాలతో అధికారంలో ఉన్నవారు అరెస్టులు, కేసులు, ఆంక్షలు, అణచివేతలతో అడ్డుకుంటారు. అభివృద్ధి నిరోధక కార్పొరేట్ భావజాలానికి వ్యతిరేకంగా వెళ్లకుండా బలమైన ప్రత్యామ్నాయ శక్తులకు చోటు కల్పించకుండా చేస్తారు.

ట్రంప్ వేషాల మధ్య.....

ఈ సమయంలోనే చూడండి, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నేరుగా మీడియాపై విరుచుకుపడటమే కాక డెమొక్రాట్లను బలపరిచిన న్యూయార్క్ టైమ్స్ పై పరువు నష్టం కేసు వేశారు, (కాకపోతే కోర్టు కొట్టి వేసింది) మీడియా గోష్టులలో నేరుగా విలేకరులపై వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు. బెదిరింపులకు దిగుతున్నారు. అమెరికా సైనిక కేంద్రమైన పెంటగాన్ నుంచి వార్తలు సమాచారం సేకరించేవారు తాము నిబంధనలు పాటిస్తామని ముందే హామీ పత్రం రాసివ్వాలని. ఆ సమాచారాన్ని ఎలా వాడుకోవాలో కూడా ఆంక్షలు అనుసరించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రపంచాధిపత్యం కోసం అమెరికా అందులోనూ ట్రంప్ ఉన్మాదాహంకార పాలనలో కుట్రలు, కుత్సితాలతో చెలరేగిపోతుంటే ఆ విషయాలు ప్రపంచానికి తెలియకుండా బహిరంగ విధానమే తీసుకున్నారన్నమాట. మరో పెద్ద విపరీతం ఏమిటంటే ట్రంప్ రక్షణ శాఖకు యుద్ధ శాఖ అని పేరు మారుస్తున్నారు. 1949 వరకు ఆపేరే ఉంటే తర్వాత మార్చారు. కానీ నేరుగా యుద్ధ శాఖ అనడం అంటే ఎవరో ఒకరి మీద యుద్ధం చేయడం, యుద్ధాలను రెచ్చగొట్టటమే విధానం అని ప్రకటించుకోవడమే కదా. వీటన్నిటికీ కేంద్రం పెంటగాన్. కనకే ఈ ఇనుపతెర ప్రపంచంలో మొదటి ప్రజాస్వామ్య దేశమని తమకు తామే కితాబిచ్చుకొని, పత్రికా స్వాతంత్ర్యం కోసం తొలి రాజ్యాంగ సవరణ తెచ్చామనే చోటనే ఇంత ప్రత్యక్ష దాడిని ఎలా చూడడం? అమెరికా మీడియా మొత్తంగా మితవాదం గుప్పెట్లోకి పోయిందని గార్డియన్ ఇటీవల పతాకశీర్షికగా ప్రచురించింది. సిబిఎస్ దానికి అనుబంధమైన పారగాన్ సంస్థలు నేరుగా ట్రంప్‌కు వంత పాడుతుంటే రూపర్ట్ మర్డోక్ ఫ్యాక్స్‌న్యూస్ కూడా అటు ఇటూ తిరిగి ఆ వైపే మొగ్గుతున్నాయి. ఏమంటే ట్రంప్ వచ్చాక వారి షేర్ల ధరలు 40 శాతం పెరిగాయట. న్యూయార్క్ టైమ్స్ మొన్నటి ఎన్నికల్లో కూడా నేరుగా కమలహరిస్‌ను బలపరిచింది గానీ విధానాలపరంగా ఆ పరిధికి భిన్నం ఏమి కాదు. మొత్తం పైన వేలమంది పాత్రికేయుల తొలగింపు, ఆంక్షలు, భారాల పెంపు, హామీల రద్దు వంటి వాటితో కూడా కార్పొరేట్ సంస్థలు లొంగదీసుకుంటున్నాయని రిపోర్టర్స్ శాన్స్

బార్డర్స్ (సరిహద్దులు లేని విలేకరులు) అనే సంస్థ నవివరంగా ప్రకటించింది. భారతీయులతో సహా ట్రంప్ తాకిడికి గురవుతున్న వారి తీరుచూస్తున్నాం. కానీ ఈ కొత్త ఆంక్షల్లో సోషల్ మీడియా ఖాతాల వివరాలు కూడా ఇవ్వాలని ఆదేశించటం గమనించదగింది. గాజాలో జర్నలిస్టులు నేరుగా పోస్టులు పెట్టి ప్రాణాలు కోల్పోతుంటే పట్టలేదు కానీ అమెరికా వెళ్ళిన భారతీయ విద్యార్థులు, బుద్ధిజీవులు పాలస్తీనాకు సంఘీభావం చెప్పడాన్ని నిషేధించడం చూస్తున్నాం.




మోడీ మేనేజ్‌మెంట్‌లో....

ఇక స్వదేశానికి వస్తే మోడీ సర్కారు పై ఉక్కుపిడికిలి అంతకంతకు బిగుస్తున్న పరిస్థితి. మీడియా స్వేచ్ఛకు సంబంధించిన సూచికలో మన దేశం 180 దేశాల్లో 151వ స్థానంలో ఉంది. ఈ విషయమై ఆర్జెడి సభ్యుడు మనోజ్ కుమార్ పార్లమెంటులో ప్రశ్న వేస్తే సమాచార పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఎల్ మురుగన్ సమాధానమే దాటేశారు. దేశంలో 1,54.000 ప్రచురణలు నడుస్తున్నాయని, 700 ప్రైవేటు టీవీ ఛానళ్ళు ఉన్నాయని, అసంఖ్యాకమైన యూట్యూబ్ ఛానళ్లున్నాయని ఏవేవో లెక్కలతో సరిపెట్టారు. 1995 కేబుల్ టీవీ నెట్‌వర్క్, 2021 ఐటీ చట్టం దేశంలో మీడియాకు వర్తిస్తాయని పైపైనే జవాబు ఇచ్చారు. అంతేకానీ మీడియా స్వేచ్ఛకు సంబంధించి ఎందుకు వెనుకబడిపోయాం అన్నది మాత్రం మాట్లాడలేదు. ఎమర్జెన్సీ యాభై ఏళ్ల సందర్భంలో అప్పటి సెన్సార్‌షిప్‌ను, అప్రజాస్వామిక పోకడలను ఖండించేటప్పుడు ప్రస్తుత పరిస్థితి అంతకన్నా అధ్వాన్నంగా ఉందని మీడియా విమర్శకులు సోదాహరణంగా చెబుతున్నారు. వాస్తవానికి భారత ప్రధాన మంత్రిగా మోడీ ఇంతవరకు ఒక్క మీడియా గోష్టి కూడా జరిపింది లేదు. ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా 2002 జాతి హత్యాకాండ గురించి గట్టిగా అడిగినందుకు టీవీ ఇంటర్వ్యూ నుంచి లేచిపోయారు. దాని నుంచి మీరు నేర్చుకున్న గుణపాఠం ఏమిటని ఎవరో అడిగితే మీడియా మేనేజ్‌మెంట్ బాగా చేసి ఉండాల్సిందన్నారు. అంతేకానీ మత రాజకీయాలు, పాలనలో ప్రజాస్వామ్యం వంటి వాటి జోలికి పోలేదు. ప్రధాని అయ్యాక మోడీ ఆ పాఠమే అమలు చేసి నిర్దాక్షిణ్యంగా నిక్కచ్చిగా మీడియా మేనేజ్‌మెంట్ మొదలుపెట్టారు. అస్మదీయ మీడియాకు వేల కోట్ల రూపాయల అడ్వర్‌టైజ్‌మెంట్లు ఇస్తూ గోడి మీడియాను సృష్టించుకున్నారు. టీవీ చానళ్లు, పత్రికలు మొత్తంగా గుప్పిట్లోకి తెచ్చుకున్నారు. సోషల్ మీడియాలో సంఘపరివార సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నారు. మోడీ భజన, ప్రత్యర్థులపై, ప్రగతి శక్తులపై విషవిద్వేష ప్రచారానికి అవి పనిముట్లుగా మార్చుకున్నారు. ఈ అదుపాజ్ఞలు, నియంత్రణలు, ప్రలోభాల మధ్య మీడియా మోడియాగా మార్చి వేయబడింది. ఇందుకు కార్పొరేట్ శక్తుల అండదండలు పుష్కలం. ఆదానీ మిగిలిన రంగాలను ఆక్రమించడంతో పాటు మీడియాలోనూ 40 శాతం కైవసం చేసుకున్నారు. ఎన్‌డిటీవీ కన్నా ఇందుకు మరో ఉదాహరణ ఉండదు. ఇంత చేసినా కొరకరాని కొయ్యలా ప్రజాస్వామ్యం, లౌకిక భావజాలం, సామ్రాజ్యవాద వ్యతిరేక చైతన్యం అనే మీడియాను అణిచివేసేందుకు రాజ్య బలాన్ని, ధనబలాన్ని విచ్చలవిడిగా ప్రయోగించడం పరిపాటిగా మారింది. న్యూస్‌క్లిక్, వైర్ వంటి వాటి విషయంలో జరిగిందేమిటో దేశమంతా చూసింది.

ఆదాని రక్షణలో.....

వైర్‌లో ఆపరేషన్ సింధూర్ కథనాలు తీసి వేయించటమే కాక కొంతకాలం అందుబాటులో లేకుండా చేశారు. తీరా చూస్తే ఇప్పుడు ఏం జరిగిందనే దానిపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఇక ఆదానిపై అమెరికా మీడియాలో కథనాలు, ఆరోపణలు వచ్చినా మన దేశంలో మాత్రం బడా మీడియాలో ఆపగలిగారు. ఇప్పుడు ట్రంప్‌తో దాగుడుమూతల వెనక ఆ ప్రభావం కూడా ఉందనే అంచనాలు ఉన్నాయి. తాజాగా సెబీ ద్వారా ఆదానికి

క్లీన్ చీట్ ఇప్పించారు. మరోవైపున రవినాయర్, అభిర్‌దాస్ గుప్తా తదితర జర్నలిస్టుల బృందం పదిమంది ఆదాని ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఐఎల్) నిర్వాకాలపై పరిశోధనాత్మక కథనం ప్రచురించకుండా ఢిల్లీ కోర్టు స్పెషల్ జడ్జి ద్వారా ఉత్తర్వు వెలువడింది. దాన్ని ఎత్తివేయాలని వారు కోర్టుకు వెళితే ఆలస్యం చేసి మొన్న బుధవారం నాడు ప్రచురణకు అనుమతించింది. అయితే వాటి నిజానిజాలు ఏమిటో ఈ దశలో నిర్ధారణ చేయలేమని కూడా ముక్తాయించారు. ఈ కేసులో పిటిషనర్లకు మాత్రమే ఇది వర్తిస్తుంది తప్ప పరంజయ గుహఠాకూర్ తదితరులకు వర్తించబోదని మెలిక పెట్టారు. ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కనీసం 15 మంది జర్నలిస్టులపై నిర్బంధానికి పాల్పడి నోరు నొక్కేందుకు ప్రయత్నించింది. అరెస్టులు చేసింది. హత్రాస్ ఘటనలో సిద్ధిక్ కప్పన్ దీర్ఘకాలం జైల్లో మగ్గవలసి వచ్చింది. ఛత్తీస్‌గడ్‌లోనైతే రోడ్డు కాంట్రాక్టు మాఫియాపై కథనాలు రాసిన ముఖేష్ చంద్రకర్ మరణ ఉదంతం సంచలనం కలిగించింది. ఆఖరుకు మామూలు యూట్యూబర్లను కూడా వీరు వదిలిపెట్టడం లేదు. బిజెపి అధికారంలో లేని తమిళనాడు కర్ణాటక వంటి చోట్ల సంఘపరివార సంస్థలు కేసులతో దాడి చేస్తాయి. ప్రసిద్ధ రచయితలుగా స్టార్ట్ అప్ కమెడియన్లుగా ఉన్నవారు కూడా ఈ ఉచ్చులో చిక్కిపోయి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉండాల్సిందే. ఈ ప్రైవేటు కేసులకు పోలీసులు ఎక్కడ లేని విలువ ఇచ్చి ఆగమేఘాల మీద వారి నోరు నోరునొక్కేందుకు దిగిపోతున్నారు. సుప్రీంకోర్టుతో సహా న్యాయస్థానాలు పలు తీర్పులు ఇచ్చినా మొత్తం నడక అటే.

రెండు శిబిరాలుగా....

తెలుగు మీడియాలోనూ ఈ లక్షణాలు మనం అప్పుడప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాం. ప్రముఖంగా వెలువడే పత్రికలు, ప్రసారమయ్యే ఛానళ్లలో ప్రాంతీయ పార్టీల చుట్టూ తిరగడమే కానీ దేశాన్ని పాలించే బిజెపికి మోడీ సర్కారుకు వ్యతిరేకంగా విమర్శనాత్మక కథనాలు నామమాత్రంగా మారిపోతున్నాయి. వాటి యాజమాన్య స్వరూపంలోనూ మార్పులు వచ్చేసాయి. చెప్పాలంటే ఒక ప్రముఖ పత్రికలో ఎడిట్ పేజీ వ్యాసాలు కూడా అభిప్రాయ ప్రకటనలుగా, కాలక్షేప సాధనాలుగా మారాయి. మొత్తం 16 లేదా 20 పేజీల్లో రాజకీయేతర సమాచారం కథలు, కబుర్లు, పెద్ద భాగం ఆక్రమిస్తున్నాయి. ఇక ఆ పత్రికలు చానళ్లు ప్రాంతీయ పార్టీల పట్ల తమ అనుకూల ప్రతికూలతలను బట్టి అస్మదీయ తస్మదీయ పాత్ర పోషిస్తుంటాయి. ఒకరు ఏం చేసినా తప్పు పట్టడం, ఒకరు ఏం చేసినా పొగడడం వాటి ఏకైక సూత్రం. జాతీయంగా మోడీ మోతే. ఏవో కొన్ని స్వల్ప మినహాయింపులు లేవని కాదు గాని ప్రజా సమస్యల విస్తృత కోణం మాత్రం మాయమైపోవడం ప్రత్యక్షంగా కనిపిస్తున్న సత్యం. ఏపీలో మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రమాణ స్వీకార వేదిక నుంచే నచ్చని మీడియాపై దాడిని ఎక్కుపెట్టారు. తరువాత సోషల్ మీడియా పైన కేసులు అరెస్టులు నడిచాయి. ఇప్పుడు చూస్తే టిడివి కూటమిలోనూ అంత పెద్ద భిన్నమైన పరిస్థితి కాదు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ కేంద్ర పద్ధతులను ఇక్కడ అమలు చేస్తూ ప్రత్యర్థి మీడియాపై కేసులు నడిపిస్తున్న స్థితిపై ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ (ఐఎన్ఎస్) ఎడిటర్స్ గిల్డ్ వంటివి కూడా నిరసన చెబుతున్నాయి. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, విశాఖ ఉక్కు అమ్మకం, పథకాల వంటి వాటిపైన కూడా ఈ మీడియాల కథనాలు వాటి వాటి కోణంలో ఉంటున్నాయి తప్ప విశాల ప్రజా ఉద్యమ ప్రతిధ్వనులుగా లేవు. టీటీడీతో సహా ఆలయాలు, మత వ్యవహారాల పైన కూడా ఇదే ద్వంద వైఖరి. తెలంగాణలో టిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య కూడా ఇదే ఘర్షణ, ప్రతిధ్వనులు మీడియాలో చూస్తుంటాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిట్‌చాట్ సంప్రదాయంతో కొంత సమాచారం పంచుకోవడానికి ప్రయత్నించడం గతంలో కెసిఆర్ అనుసరించిన పద్ధతికి భిన్నంగా నడుస్తున్నది. కానీ మీడియాలో లక్షణాల్లో పెద్ద తేడా లేదు. బిజెపి జాతీయంగా పోషించే పాత్ర ఇక్కడ చూపించడంతో పాటు వీలు చిక్కినప్పుడల్లా మతతత్వ కోణాలు తీసుకురావడం, కేంద్రం అధికారాన్ని ప్రదర్శించడం అదనం. రెండు చోట్లా కూడా సమస్యలపై విధానపరమైన అంశాల కన్నా వ్యక్తిగత దూషణలు, చబకబారు సవాళ్లు మీడియా చర్చలను ఆక్రమించడం రివాజుగా మారిపోయింది. మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ ప్రజాస్వామిక, లౌకికభావకులు, సంస్థలు తమ పాత్ర నిర్వహిస్తున్నా అవకాశవాద ధోరణులు కూడా తొంగి చూస్తుంటాయి. ఆ ముసుగులో పార్టీలకు వంతపాడడం, స్వప్రయోజనాలు సాధించుకోవడం, రకరకాల పిల్లి మొగ్గలతో దారి తప్పించడం చూస్తుంటాం. అన్ని కోణాలు ఒకే చోట పరిశీలించటం సాధ్యం కాని పని. అయితే ప్రజా వరణంలో మీడియా భావ స్వేచ్ఛను కాపాడుకోవడం, ఇందుకోసం పనిచేసే వారికి రక్షణ ఉండేలా చూడడం మాత్రం అత్యవసరం. ఆ పని ఎవరు, ఎందుకు, ఏం చెబుతున్నారు, చూపిస్తున్నారనేది ప్రజలు అప్రమత్తంగా నిర్ణయించుకోగలరని విశ్వసించాలి. ఆ అవగాహన పెంచాలి.

**(సెప్టెంబరు 21 నవ తెలంగాణ దినపత్రిక సౌజన్యంతో)**

# ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టుల నిరసన

**ఎ.కొండబాబు, సీనియర్ జర్నలిస్టు**

గాజా జర్నలిస్టులను ఇజ్రాయెల్ హత్య చేయడంపై ప్రపంచవ్యాప్తంగా 250కి పైగా మీడియా సంస్థలు సెప్టెంబర్ మొదటివారంలో నిరసన వ్యక్తం చేశాయి.

22 నెలల్లో 200 మందికి పైగా జర్నలిస్టుల హత్యలను పతాకశీర్షికలో మొదటి పేజీలో ముద్రించిన మీడియా సంస్థలు నిరసనను తెలిపాయి..

గాజాపై ఇజ్రాయెల్ యుద్ధంలో పెద్ద సంఖ్యలో సాధారణ పౌరులతో పాటు పిల్లలను కూడా వదిలిపెట్టకుండా నివాస ప్రాంతాలపై దాడులు సాగుతున్నాయి. వైద్యచికిత్స నిర్వహించే ఆసుపత్రులను కూడా వదలడం లేదు. అటువంటి దాడుల్లో భాగంగా జర్నలిస్టులు కూడా బలవుతున్నారు.

ఈ దాడుల్లో 200 మందికి పైగా జర్నలిస్టుల హత్యను హైలైట్ చేస్తూ 70 కి పైగా దేశాలలో 250కి పైగా మీడియా సంస్థలు మొదటి పేజీ నిరసనను నిర్వహించాయని రిపోర్టర్స్ విదౌట్ బోర్డర్స్ మీడియా స్వేచ్ఛా సంస్థ తెలిపింది.

ఐక్యరాజ్యసమితి అందించిన సమాచారం ప్రకారం, యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఇజ్రాయెల్ సైన్యం చేతిలో హతులైన పాలస్తీనా జర్నలిస్టుల సంఖ్య 2025 ఆగస్టు 11 నాటికి 242మంది. ఆ సంఖ్య ఇంకా పెరుగుతూనే ఉంది.

మరోవైపు, కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె) 2025 ఆగస్టు 10 నాటికి 192 మంది జర్నలిస్టులను, వారిలో కనీసం 184 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ చంపిందని నివేదించింది.

ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌జె) 2025 ఆగస్టు 11 నాటికి ఇజ్రాయెల్ చేత కనీసం 180 మంది పాలస్తీనా జర్నలిస్టులు,మీడియా కార్మికులను చంపినట్లు వెల్లడించింది.

గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం జూలై 2024లో నిర్వహించిన లెక్క ప్రకారం ఇజ్రాయెల్ చేతిలో హత్యకు గురైన పాలస్తీనియన్ జర్నలిస్టుల సంఖ్య 160గా ఉంది.

జనవరి 2025 నాటికి, ఇజ్రాయెల్ 42 మంది పాలస్తీనియన్ జర్నలిస్టులను చంపిందని, ఈ సంఖ్య 202కి పెరిగిందని,

1992 నుండి ఇజ్రాయెల్-పాలస్తీనా వివాదంలో జర్నలిస్టులకు అత్యంత ప్రాణాంతకమైన కాలమని ప్రపంచ చరిత్రలో తెలిసిన అన్ని సంఘర్షణలలో జర్నలిస్టులకు అత్యంత ప్రాణాంతకమైన సంఘర్షణ అని కాస్ట్స్ ఆఫ్ వార్ ప్రాజెక్ట్ తెలిపింది.

"ఇజ్రాయెల్ సైన్యం గాజాలో జర్నలిస్టులను చంపేస్తున్న రేటుతో, మీకు సమాచారం అందించడానికి త్వరలో ఎవరూ ఉండరు" అని గ్రూప్ జనరల్ డైరెక్టర్ థిబౌట్ బ్రూటిన్ ఒక ప్రకటనలో తెలిపారు.




జూలై 2025 నాటికి, మరో 15 మంది జర్నలిస్టులను చంపి ఈ సంఖ్య 217కి పెరిగిందని నివేదికలో పొందుపర్చింది.

ఇజ్రాయెల్ ఇప్పటివరకు హత్యకు గురైనట్లు నివేదించబడిన అన్ని జర్నలిస్టుల పేర్లను జాబితా చేసిన సిపిజె, ఐఎఫ్‌జెతో సహా బహుళ వనరుల నుండి డేటాను సేకరించడం ద్వారా, ఆగస్టు 11, 20 నాటికి ఈ విషయాన్ని నిర్ధారించారు.


ఇజ్రాయిల్ సైన్యం ఈ మారణకాండను సమర్ధించుకునే ప్రయత్నం చేస్తోంది. జర్నలిస్టుల ముసుగులో హమాస్ ఉగ్రవాదులున్నారని తమకు స్పష్టమైన సమాచారం అందిన తరువాతనే ఈ దాడులదాడులు చేస్తున్నట్టు ప్రకటిస్తున్నది. అంతే తప్ప ఎంతమాత్రం వెనక్కు తగ్గడం లేదు. పునరాలోచన చేసే వైపుగా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు.

## రోడ్డు ప్రమాదంలో విలేకరి మృతి



ప్రజాశక్తి గన్నవరం విలేకరిగా గత 31 ఏళ్ల నుండి పనిచేస్తున్న ఎన్ శ్రీనివాసరావు సెప్టెంబరు 27 ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన ప్రజాశక్తిలో పేపర్ బాయ్‌గా చేరి గన్నవరం విలేకరిగా అందరి మన్ననలను అందుకున్నారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. కలిమిశ్రీ, ఎం.బి.నాథన్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## ప్రముఖ జర్నలిస్టు కొట్రు కన్నుమూత



ప్రముఖ జర్నలిస్టు, ది స్టేట్ మెన్ మాజీ ఎడిటర్ ఓ తరం పాత్రికేయులకు గురువైన ఎంఎల్ కొట్రు సెప్టెంబరు 25న గురుగ్రామ్‌లో కన్నుమూశారు. లండన్ లోని సండే టైమ్స్‌కు ఇండియా కరస్పాండెంట్‌గా కూడా ఆయన పనిచేశారు. సొంత రాష్ట్రమైన జమ్మూ కాశ్మీర్‌లో కొట్రు అనేక ప్రచురణలు చేశారు. ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా ప్రెస్ అసోసియేషన్ లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. ఆయన మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు అధ్యక్షులు ఎస్.కె.పాండే, సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్యలు సంతాపం వ్యక్తం చేశారు.

## గుండెపోటుతో పాత్రికేయుడు సురేష్ మృతి



సీనియర్ పాత్రికేయుడు మండే సురేష్ గుండె పోటుతో హఠాన్మరణం చెందారు. గత 20 ఏళ్ళుగా పత్రికా రంగంలో మల్కాజిగిరి ప్రాంత విలేకరిగా పని చేస్తున్నారు. గత కొన్ని నెలల క్రితం కాలు విరిగి కోలుకుంటున్న క్రమంలో సెప్టెంబరు 25న గుండెపోటు రావడంతో మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సురేష్ మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ,రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.




**సెప్టెంబరు 25న కోరుకొండలో తూర్పుగోదావరి జిల్లా ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజానగరం, కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాల సమావేశం జరిగిన దృశ్యం**




# మీడియా కమిషన్ ఏర్పాటు అవసరం

జర్నలిస్టుల భద్రతకు, మీడియా స్వేచ్ఛకు మీడియా కమిషన్ ఏర్పాటు అవసరం అని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు కరకుంట్ల జయరాజ్ తెలిపారు ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల భద్రత, పత్రికల స్వేచ్ఛ, వారి కుటుంబ సంక్షేమంపై ప్రభుత్వ విభాగాల చర్యలు వలన ప్రతి జర్నలిస్టుకు గృహ నిర్మాణం, ఇంటి పట్టాలు అందించాలని ఆయన కోరారు.

"జర్నలిస్టులు సమాజానికీ వెలుగు, నిజాన్ని వెలికితీయడం వారి కర్తవ్యం" అంటూ వారు పత్రికా స్వేచ్ఛను కాపాడటం, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను నిరోధించడానికి ప్రత్యేక చట్టం అవసరమని స్పష్టం చేశారు. వృద్ధాప్య దశలో జర్నలిస్టులు ఆర్థిక భద్రత పొందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం ప్రవేశపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పిల్లలకు ప్రైవేటు పాఠశాల ఫీజు రాయితీ కల్పించటం, అక్రిడిటేషన్ కార్డుల మంజూరు తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఏపీడబ్ల్యూజేఎఫ్ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

**అక్రిడేషన్ లేని జర్నలిస్టులకు ఇన్సూరెన్స్**

చిత్తూరు జిల్లాలో అక్రిడేషన్ లేని జర్నలిస్టులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించే విధంగా జిల్లా కమిటీ చర్యలు తీసుకుంటుందని ఏపీడబ్ల్యూజేఎఫ్ చిత్తూరు జిల్లా కమిటీ తీర్మానించింది. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో ఏపీడబ్ల్యూజేఎఫ్‌లోని అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు అందరికీ జర్నలిస్టుల హెల్త్‌కార్డుకు సంబంధించిన మొత్తం డబ్బులను చెల్లించింది. అక్రిడేషన్ లేని జర్నలిస్టులకు కూడా భద్రత కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సమావేశం తీర్మానించింది. జర్నలిస్టుల హెల్త్‌కార్డు పంపిణీకి రాష్ట్ర నేతలను రాజకీయ ప్రముఖులతో సభ ఏర్పాటు చేయాలని తీర్మానించింది. రాష్ట్ర కమిటీ పిలుపులను మరింత పకడ్బందీగా జిల్లాలో నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. జర్నలిస్టుల సంక్షేమంతో పాటు భద్రతకు అధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా పోరాటాలు నిర్వహించాలని తీర్మానించింది. యూనియన్ అవసరాల నిమిత్తం పుంగనూరు నియోజకవర్గంలోని అధ్యక్షులు సతీష్, కార్యదర్శి అప్పాలను జిల్లా కమిటీలోకి తీసుకోవాలని జిల్లా కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. పుంగనూరు అధ్యక్ష కార్యదర్శులుగా సైపుల్లా, శ్రీనివాసులను నియమించింది. జర్నలిస్టుల పెన్షన్ సౌకర్యం కోసం, ఇంటి పట్టాలు, రైల్వే పాసుల పునరుద్ధరణ, మీడియా కమిషన్ ఏర్పాటు, తదితర అంశాలపై ఉద్యమాలు నిర్వహించాలని తీర్మానించింది. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షులు బి ప్రకాష్ సమావేశానికి అధ్యక్షత వహించగా కార్యదర్శి సలీం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీబీజేపి అధ్యక్షులు చల్లా జయచంద్ర, కార్యదర్శి నీరజాక్షులు, రాష్ట్ర నాయకులు మహేష్, జిల్లా నాయకులు శివశంకర్ రాజు, గిరి శేఖర్, దినేష్ కుమార్ యాదవ్ రెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, అప్ప రామయ్య, శ్రీనివాసులు, కమలాపతి రెడ్డి, మురళి, మంజునాథ్, హరి ప్రసాద్, నాగరాజు, ఆదిత్య మించిన, పుంగనూరు నియోజకవర్గ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.






# దొందు దొందే

మన రాష్ట్రంలోని ప్రధాన పత్రికలు రెండు రాజకీయ శిబిరాలుగా చీలిపోయి చాలా కాలం అయ్యింది. ఒకరు అవునంటే మరొకరు కాదనడం అందుకు అనుగుణంగా వార్తలను వండి వార్చడంలో పోటాపోటీలు పడుతుంటాయి. పరస్పర యుద్ధభేరీలు మోగిస్తుంటాయి. అయితే ఈ రెండు శిబిరాలు ప్రజా సమస్యలను, ఉద్యమాలను తమ పత్రికల్లో కనిపించకుండా చేయడంలో ఒకే విధానాన్ని అనుసరిస్తున్నాయంటే ఆశ్చర్యంగా ఉన్నా అదే సత్యం. ఈ వారంలో రాష్ట్రంలో జరిగిన కొన్ని పరిణామాలు వాటి పట్ల ఈ పత్రికలు అనుసరించిన వైఖరులు గమనిస్తే వీరి ఏకత్వం మరింత స్పష్టంగా అర్థమవుతుంది.

మన రాష్ట్రాన్ని పట్టిపీడిస్తున్న సమస్యల్లో పోలవరం ముంపు బాధితుల సమస్య అతి ప్రధానమైనది. ప్రకృతి ఒడిలో అతి నిర్మలంగా బ్రతికే గిరిజనులను పాలకులు అభివృద్ధి పేరుతో శాపగ్రస్తులుగా మార్చేశారు. విద్య, వైద్యం, రోడ్లు, మంచినీటి సదుపాయాలు లేని వెలివాడలలో అనాథ బిడ్డలుగా వదిలేశారు. ఈ దీనుల పక్షాన నిలవాల్సిన ప్రధాన మీడియా అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఎప్పుడైనా చూస్తే పోలవరంలో అద్భుతం జరిగిపోతుందని లేదా అథ: పాతాళానికి దిగజారి పోతుందని రాజకీయ కోణంలో రాయడమే తప్ప ప్రాజెక్టుకు సమిధలు అయిపోతున్న గిరిజనుల బ్రతుకుల గురించి రాసిన పాపాన పోవడం లేదు. అంతరిక్ష యానంలో దూసుకుపోతున్న నేటి కాలంలో డోలీమోతల్లో గర్భవతులను తీసుకువెళుతున్న గాథలు, రోజూ కిలోమీటర్లకు పైగా నడిచి ప్రాథమిక పాఠశాలకు వెళుతున్న పసిబిడ్డలు, రోగాలతో, రొప్పులతో ప్రాణాలు కోల్పోతున్న యువతీ యువకుల గురించి రాయడానికి వీరి కలంలో సిరా ఉండదు. వీరి పత్రికల్లో చోటు దక్కదు. ముంపు బాధితుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తేవడానికి పార్లమెంటులో వినిపించడానికి సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఉత్తమ పార్లమెంటేరియన్ జార్జి బ్రిటాస్ ఆధ్వర్యంలో రెండు బృందాలు గత శని ఆదివారాల్లో అటవీ ప్రాంతాల్లో పర్యటించాయి. కొండలు, గుట్టలు, వాగులు, వంకలు దాటి చెట్టుకొకరు పుట్టకొకరుగా ఉన్న గిరిజనుల దరికి చేరి వారి బాధలను పరిశీలించిన వార్తలను ఈ రెండు శిబిరాల ప్రధాన మీడియా సంస్థలకు కనిపించలేదు. జాతీయ పత్రికలు రాసిన తర్వాత కూడా వారి కనీస కంటి చూపునకు ఆ దీనుల గాథలు నోచుకోలేదు. ఇదేదో కాకతాళీయమో, అశ్రద్ధో, నిర్లక్ష్యం అనుకుంటే పొరపాటు. ముంపు బాధితుల బాధలు చూస్తే రాస్తే దానికి కారణమైన కేంద్రం గురించి రాయాలి. కేంద్ర పాలకుల ఆగ్రహానికి గురికాకుండా వారి కరుణాకటాక్షాలు తమ బాసుల మీద కొనసాగేలా చూడడం కోసం గిరిజన బిడ్డల గాథలను అడవికి వదిలేశారు.

నెల్లూరు జిల్లా కరేడు గ్రామంలో బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా రైతులు ఉమ్మడిగా ఏకమై పోరాడుతున్నారు. తమ గ్రామంలో తాము కలిసి కూర్చొని మాట్లాడుకోవడానికి వీలు లేకుండా 30 యాక్ట్ నిర్బంధంలో గ్రామస్తులు బతుకుతున్నారు. మా భూమి ఇవ్వం అంటున్నందుకు అక్రమ కేసులను ఎదుర్కొంటున్నారు. వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు ఆ అన్నదాతలకు అండగా నిలిచేందుకు సోమవారం రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, వామపక్ష పార్టీల నేతలు కరేడు గ్రామానికి వెళ్లారు. పరామర్శకు వచ్చిన నాయకులను ప్రజలు కలవకుండా గ్రామాన్ని వందల మంది పోలీసులు చుట్టూ ముట్టి నాయకులను బలవంతాన అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో రోజంతా నిర్బంధించారు. ఇంత జరిగితే ఈ రెండు మీడియా శిబిరాలకు ఇది ప్రజావార్తగా కనిపించలేదు. ఏదో ఇచ్చామంటే ఇచ్చామన్నట్టుగా ఓ మూలకు ఇంత రాశారు. ఇదే భూసేకరణ మీద గతంలో పేజీలకు కొద్దీ రాసిన వారు ఇప్పుడు దీర్ఘ నిద్రలో ఉంటే అప్పుడు కీర్తించిన వారు కాగల కార్యం జరిగిపోతున్నందుకు మౌన దీక్షలో ఉన్నారు. కారణం ఏ కంపెనీ కోసం భూసేకరణ జరుగుతుందో ఆ యజమాని రెండు మీడియా శిబిరాల రాజకీయ శ్రేయోభిలాషులకు అస్మదీయుడు కావడమే. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సుదీర్ఘకాలం కార్మికుల పోరాడుతుంటే అది ఆంధ్రుల హక్కుగా వీరికి గుర్తు రావడంలేదు. వేలాది కాంట్రాక్టు కార్మికులను బలవంతాన తొలగిస్తున్నా, పర్మనెంట్ కార్మికులను విఆర్ఎస్ పేరుతో ఇంటికి సాగనంపుతున్నా, 33 యూనిట్లను ప్రైవేటీకరిస్తున్న కేంద్రం గురించి రాయకపోవడం దేనికి సంకేతం? అయితే ఓ పత్రిక మాత్రం అప్పుడప్పుడు ప్రైవేటీకరణ గురించి రాస్తుంది. గత 11

సంవత్సరాలుగా రాష్ట్రానికి ఎన్నో రకాలుగా తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వానికి మరోసారి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో మద్దతు ఇవ్వడానికి పాలక, ప్రతిపక్షాలు పోటీ పడుతుంటే ప్రధాన మీడియా కనీసం పల్లెత్తు రాయలేక పోవడాన్ని ఆంధ్రుల ఆత్మాభిమానానికి క్షోభ కాదా? నిత్యం సవాళ్లు ప్రతి సవాళ్లు ప్రాంతాల పేరుతో పులులు, సింహాలు అంటూ ప్రగల్బాలు పలికే పార్టీల నేతలు కేంద్రం ముందు ఇంతలా సాగిల పడుతుంటే ఒక్క మాట కూడా రాయలేని స్థితికి మీడియా దిగజారటం పాఠకులు హర్షించరని గుర్తించాలి. రౌడీషీటర్ రాసలీలలు, కిరాయి లేడి జిత్తులు వారం కొద్దీ ఒకే వార్తలు పేజీలకు కొద్ది రాయడానికి స్థలం ఉన్న పత్రికల్లో ప్రజావార్తలకు చోటు దక్కాలంటే పాటకుల నిశిత విమర్శతో పాటు అక్షరాన్ని నిజంగా ప్రజావక్షం నిలుపుతున్నదెవరో గుర్తించాలి. వాటిని ఆదరించాలి.

**(సెప్టెంబర్ 13 ప్రజాశక్తి దినపత్రిక సౌజన్యంతో)**



# పుంగనూరులో జర్నలిస్టుల ర్యాలీ

పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేకంగా మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకుడు కవరకుంట్ల జయరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబరు 16న పుంగనూరులో జర్నలిస్టులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి గోకుల్ కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ఏపీడబ్ల్యూజేఎఫ్ నియోజకవర్గ విస్తృత సమావేశంలో జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు సామాజిక, రాజకీయ ఒత్తిడులు, ఆర్థిక అస్థిరత, ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల వృత్తి రక్షణకు, వేతన భద్రతకు, న్యాయ సహాయానికి హామీ ఇచ్చే విధంగా స్వతంత్ర మీడియా కమిషన్ ఏర్పాటు తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. పత్రికారంగం బలపడితేనే ప్రజాస్వామ్యం మరింత పటిష్టమవుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

జర్నలిస్టులు సమాజానికి కళ్లుగా పనిచేస్తున్నారని, వారి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ముప్పులు, ఒత్తిడులు, ఉద్యోగ భద్రత లేకపోవడం వల్ల రోజురోజుకీ వృత్తి మరింత క్లిష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "వార్త రాస్తే కేసులు, పోరాడితే ప్రాణ హానులు, ఈ పరిస్థితుల్లో విలేఖరులు ధైర్యంగా ఎలా పని చేయగలరు?" అని ప్రశ్నించారు. పత్రికాస్వేచ్ఛ లేకుండా ప్రజాస్వామ్యం బలహీనమవుతుందని ఆయన స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలోని జర్నలిస్టుల సంక్షేమానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని ఏపీడబ్ల్యూజేఎఫ్ సభ్యులకు ప్రభుత్వం అందించే హెల్త్ కార్డు ప్రీమియంను యూనియన్ చెల్లించిందని వివరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకుడు మహేష్. చిత్తూరు జిల్లా కార్యదర్శి సలీం, ఏపీబీజేఏ జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, కార్యదర్శి నీరజాక్షులు, చిత్తూరు జిల్లా ఏపీడబ్ల్యూజేఎఫ్ నేతలు శివశంకర్ రాజు, హిదాయత్తుల, కృష్ణమూర్తి రెడ్డి రామయ్య ,శ్రీనివాసులు నాగరాజు ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ మురళి పుంగనూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు మురళి వర్కింగ్ ప్రెసిడెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి పుంగనూరు నియోజకవర్గ అధ్యక్షులు మహమ్మద్ సైపుల్ల అధ్యక్షత వహించారు. కార్యదర్శి శ్రీనివాసులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



# వార్తలు రాయడమే నేరమా?



**కొమ్మినేని శ్రీనివాసరావు**
సీనియర్ జర్నలిస్టు

'తిరుమల శ్రీవారి లడ్డు ప్రసాదంలో జంతు కొవ్వు కలిసింది' కోట్లాది హిందువుల మనోభావాలను గాయపరుస్తూ ఏపీ ముఖ్యమంత్రి అయిన కొద్ది కాలానికి చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణ ఇది. ఆ వెంటనే దానిని అందుకొని సనాతన వేషం కట్టారు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్.

'ప్రకాశం బ్యారేజీని బోట్లతో ధ్వంసం చేయడానికి యత్నించారు' ఇది కృష్ణా నదికి వరదలు వచ్చిన సమయంలో బ్యారేజీ వద్దకు కొట్టుకు వచ్చిన బోట్ల గురించి చంద్రబాబు చేసిన మరో విమర్శ. ఇలా అనేక అభియోగాలను చంద్రబాబు అధికారంలోకి వచ్చాక చేశారు. వాటన్నిటిలో అత్యధిక భాగం గత ముఖ్యమంత్రి వైయస్ జగన్ కు ఆపాదించి చేశారు.

## ఇలాగైతే ఎన్ని కేసులు పెట్టొచ్చు

అధికారంలోకి వచ్చాకే కాదు అంతకుముందు విపక్షంలో ఉన్నప్పుడు కూడా ఈ నేతలు జగన్‌పై పలు తీవ్ర అభిప్రాయాలు, అభియోగాలు గుప్పించారు. 'జగన్ ఏపీలో ప్రజల భూములన్నీ కొట్టి కొట్టేయడానికి ప్రయత్నిస్తున్నారు, జగన్ 14 లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని ధ్వంసం చేశారు' అంటూ నోటికొచ్చినట్లు మాట్లాడారు. ఇక పవన్ కళ్యాణ్ అయితే 30 వేల మంది అమ్మాయిలు ఏపీలో తప్పిపోయారు అంటూ వాలంటీర్లపై నిందలు వేశారు.

ఇప్పుడు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రామాణికంగా తీసుకుంటే అప్పట్లో వారిపై ఎన్ని కేసులు పెట్టి ఉండవచ్చో! అలాంటి అబద్ధపు ఆరోపణలను ప్రచారం చేసి ఎల్లో మీడియాపై ఎన్ని కేసులు పెట్టాలో! కానీ జగన్ టైంలో అలా చేయలేదు. వాటిని రాజకీయంగానే చూసి వదిలేశారు. ఇటీవల కాలంలో ఏపీని పోలీస్ రాజ్యంగా మార్చి విపక్ష వైసిపి వారిపైనే కాకుండా తనకు గిట్టని సాక్షి మీడియా పైన చంద్రబాబు ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతున్న నేపథ్యంలో ఈ సంగతులు గుర్తు చేయవలసి వచ్చింది.

## కేసులతో కొత్త రికార్డులు

రాజకీయ నేతల ప్రెస్ కాన్ఫరెన్సుల ఆధారంగా మీడియాపై కేసులు పెడుతూ చంద్రబాబు ప్రభుత్వం కొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఇటీవల వైసిపి నేత అంబటి మురళీకృష్ణ అమరావతి వరద ముంపు గురించి మీడియాకు ఒక విషయం చెప్పారు. ఆ వరద నీటి మళ్లింపు వల్ల గుంటూరు ఛానల్‌కు గండి పడిందని, ఫలితంగా పొన్నూరు ప్రాంతంలో సుమారు 70 వేల ఎకరాల పంట పొలాలు మునిగాయని ఆరోపించారు. ఆయన చెప్పిన విషయాలను సాక్షి ప్రచురించింది. సాధారణంగా ప్రభుత్వ పక్షాన ఎవరైనా ఏమి చేయాలి? అది వాస్తవమా కాదా? అన్నదాన్ని పరిశీలించి మీడియాకు వివరణ ఇచ్చి వార్తను ప్రజలకు తెలియజేయాలని కోరవచ్చు. అలా కాకుండా సంబంధిత అధికారి ఒకరితో సాక్షిపై ఏకంగా కేసు పెట్టించారు. తాడేపల్లి పోలీసులు సాక్షి ఎడిటర్ ఆర్ ధనుంజయ రెడ్డికి నోటీసు ఇచ్చి తమ ముందు విచారణకు హాజరుకావాలని కోరారు. విశేషం ఏమిటంటే అదే సమయంలో టిడిపి మీడియా ఒక కథనాన్ని ఇస్తూ అమరావతిలో వరద ముప్పు నివారణ కోసం ప్రభుత్వం ఆరువేల కోట్లతో మరో రెండు ప్రాజెక్టులను చేపడుతుందని తెలిపింది.

కేసులు అక్రమమని తెలిసినా పోలీసులు ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లకు లొంగక తప్పడం లేదు. ఈ మాట కొందరు పోలీసు అధికారులు జర్నలిస్టులకు వ్యక్తిగతంగా చెబుతున్న సందర్భాలు ఉన్నాయి. ఇదంతా రెడ్‌బుక్ ఎఫెక్ట్ అని ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి ఇలాంటి అసంబద్ధ చర్యలకు దిగుతోందని తెలుస్తోంది. సాక్షి గొంతు నొక్కి వేస్తే తమను ప్రశ్నించేవారు ఉండరని పెద్దలు భావిస్తున్నారేమో తెలియదు.

మరో వార్త చూడండి. అవినీతి కారణంగానే పోలీస్ అధికారుల ప్రమోషన్లను జాప్యం చేస్తున్నారని సాక్షి స్టోరీ ఇచ్చింది. దానికి పోలీసు పెద్దలకు కోపం వచ్చిందంట. ఇది నిజం కాకపోతే వాడు ఖండించవచ్చు. కానీ పోలీసు ఉద్యోగుల సంఘం నేతతో కేసు పెట్టించేశారు. గతంలో ఈ తరహా వార్తలు మీడియాలో వస్తే సదరు సంఘం నేతలు వివరణ ఇచ్చేవారు. పాపం ఇప్పుడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు గాని మరికొందరు టిడిపి నేతలు, జనసేన క్యాడర్ కానీ కొంతమంది పోలీసుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసినా ఈ సంఘం నేతలు నోరు మెదపలేకపోతున్నారు. కానీ సాక్షి మీద సంఘం అధ్యక్షుడు తాడేపల్లి పోలీస్ స్టేషన్లో కేసు పెట్టడం అర్ధరాత్రి వేళ సాక్షి ఆఫీసుకు

పోలీసులు వచ్చి హడావిడి చేయడం జరిగింది. ఈ కేసులో కూడా విచారణకు నోటీసులు ఇచ్చారు. ఈ విచారణకు ఎడిటర్ ధనుంజయ రెడ్డితో పాటు సీనియర్ పాత్రికేయులు హాజరయ్యారు. ఆ సందర్భంలో పోలీసు అధికారులు ఆ సమాచారం ఎవరు ఇచ్చారో చెప్పాలని కోరారంట. జర్నలిజం సూత్రాల ప్రకారం సోర్స్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ రహస్యంగా ఉంచాలి. అయినా ఆ వివరాలు కోరారు. ఆ పోలీస్ అధికారులకు కూడా తమ శాఖలో జరుగుతున్న పరిణామాలు తెలిసే ఉండాలి. ఏ అధికారులు ప్రమోషన్ పొందలేకపోయారు, దానికి కారణాలు ఏమిటో వారికి తెలిసి ఉండాలి. కానీ పై స్థాయి నుంచి ఒత్తిడి వచ్చింది కాబట్టి వారు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారని అర్థం అవుతోంది.

ద్వంద ప్రమాణాలు

ఇంకో ఉదంతాన్ని చూద్దాం. రాయలసీమకు చెందిన ఒక పోలీస్ అధికారి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న తీరుపై సాక్షి ఒక వార్తను ఇచ్చింది. ఆ అధికారి పేరు రాయలేదు. తమకు వచ్చిన సమాచారంలో నిజం ఉందని నమ్మితే కొన్ని జాగ్రత్తలు తీసుకొని కథనాలు ఇస్తుంటారు. ఈ స్టోరీ పై సీనియర్ అధికారికి ఆగ్రహం వచ్చింది. వేరే అధికారిని పిలిచి కేసు పెట్టించారు. ఆ అధికారి తను ఏ తప్పు చేయకపోతే ఆ కథనం తనను ఉద్దేశించి రాశారని అభిప్రాయం కలిగితే ధైర్యంగా మీడియా సమావేశం పెట్టి తన వాదనను వినిపించి ఉండవచ్చు. తన పరువుకు భంగం కలిగించాలని నోటీసు ఇచ్చి ఉండవచ్చు. అలా చేయకుండా మరొకరితో కేసు పెట్టించడంలోనే దొల్లతనం ఉందనిపిస్తోంది. ఏపీ పోలీసుల ప్రవర్తనకు పులివెందుల జడ్పిటిసి ఉపఎన్నిక జరిగిన వైనమే పెద్ద శాంపుల్. తమ ఓట్లు తమను వేయనివ్వాలనే కొందరు ఓటర్లు పోలీసుల కాళ్లు పట్టుకున్నారంటే అది పోలీసు వ్యవస్థకు ఎంత అప్రతిష్టో ఊహించుకోవచ్చు. కోర్టులలో బెయిల్ రాకుండా ఉండడం కోసం సంబంధం ఉన్నా లేకపోయినా తోచిన సెక్షన్లు పెట్టి రిమాండ్ ఉత్తర్వులు వచ్చేలా చేయడంలో ఏపీ పోలీసులు స్పెషలైజేషన్ సంపాదించారన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ వారిపై వీలైనంత కేసులు పెట్టడం... ఇదే టిడిపి... జనసేన కార్యకర్తలు తమ సమక్షంలోనే గుండాయిజానికి పాల్పడినా నిస్సహాయంగా ఉండిపోవడం సమాజానికే ప్రమాదకరమని చెప్పక తప్పదు.

రెండు రోజుల క్రితం మచిలీపట్నంలో జనసేన కార్యకర్తలు చేసిన గుండాయిజం తెలిసిందే. టీవీ సాక్షి టీవీ చర్చలో అభ్యంతర పదజాలం పదం వాడారని అంటూ కూటమినేతలే కొంతమందిని పురిగొల్పి కృత్రిమ ఆందోళనలు చేయించారు. రాజకీయాలు ఎలా ఉన్నా పోలీసు వ్యవస్థ ధర్మంగా, నిష్పక్షపాతంగా లేకపోతే అది సమాజానికి హానికరం. పోలీసులకు ప్రామాణికం రెడ్‌బుక్ కాదని రాజ్యాంగమని ఎప్పటికీ గుర్తిస్తారు.

**(సాక్షి దినపత్రిక సౌజన్యంతో)**



# లోకేష్ మృతికి ఏపీడబ్ల్యూజేఎఫ్ సంతాపం

పుంగనూరులో ప్రముఖ జర్నలిస్ట్ లోకేష్ మృతికి ఏపీడబ్ల్యూజేఎఫ్ సంతాపాన్ని తెలియజేసింది. లోకేష్ భౌతికకాయం వద్ద జర్నలిస్టు నాయకులు నివాళి అర్పించారు. అనంతరం ఆయన సతీమణికి యూనియన్ తరపున ఆర్థిక సహాయాన్ని అందించారు. దీంతోపాటు లోకేష్ పిల్లల చదువుకు అయ్యే ఖర్చును జిల్లా ఉపాధ్యక్షులు శివశంకర్ రాజు భరిస్తానని హామీ ఇచ్చారు. అతి చిన్న వయసులోనే జర్నలిజంలో తన జీవితాన్ని మొదలుపెట్టి దాదాపు 15 సంవత్సరాలు జర్నలిజంలో తన ప్రయాణాన్ని కొనసాగించి అనారోగ్యం కారణంగా సెప్టెంబరు 15న కోడూరు లోకేష్ మృతి చెందారు. 2010లో స్టూడియో ఎన్ లో పుంగనూరు నియోజకవర్గ జర్నలిస్టుగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించి, తదుపరి టెన్ టీవీ, 6 టీవీ చానల్లో మచ్చలేని జర్నలిస్టుగా పేరు సంపాదించుకున్నారు. లోకేష్‌కు భార్య సాయికీర్తన, ఇద్దరు పిల్లలు చార్విక, లోక్షితలు. లోకేష్ కుటుంబాన్ని ఏపిడబ్ల్యూజేఎఫ్ అన్ని విధాలా ఆదుకుంటుందని నాయకులు భరోసా కల్పించారు.

# న్యూయార్క్ టైమ్స్ పై ట్రంప్ పరువు నష్టం దావా



ది న్యూయార్క్ టైమ్స్ పత్రిక తనను అవమానించటమే పనిగా పెట్టుకుందని అమెరికా అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నాయకుడు డోనాల్డ్ ట్రంప్ మండిపడ్డారు. అంతేకాకుండా విపక్ష డెమొక్రటిక్ పార్టీకి కరపత్రికగా మారిపోయిందని ఆరోపించారు. తనకు, తన కుటుంబానికి, వ్యాపారానికి వ్యతిరేకంగా తప్పుడు ప్రకటనలను ప్రచురిస్తుందని ధ్వజమెత్తారు. ఆ పత్రికపై కోర్టులో పరువు నష్టం దావా వేసినట్లు తెలియజేశారు. తనకు జరిగిన నష్టానికి గాను ఆ పత్రిక 15 బిలియన్ డాలర్లు (1.32 లక్షల కోట్లు) పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. అయితే ట్రంప్ డిమాండ్ చేస్తున్న సొమ్ము ది న్యూయార్క్ టైమ్స్ పత్రిక మార్కెట్ విలువ కంటే అధికం కావడం గమనార్హం. పాత్రికేయ రంగంలో ప్రమాణాలను పునరుద్ధరించటం సమగ్రతను కాపాడటం తన ఉద్దేశమని ట్రంప్ చెబుతుండడం విశేషం. అయితే నిపుణుల వాదన మరోలా ఉంది. న్యూయార్క్ టైమ్స్ పై పరువు నష్టం దావా వేయడం ద్వారా పత్రికా స్వేచ్ఛను హరించాలని వ్యతిరేక గళాలను అణిచివేయాలని ట్రంప్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తోందని అంటున్నారు. ట్రంప్ వ్యవహార శైలిని తప్పుపడితే కోర్టుకు లాగడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇదిలా ఉండగా ట్రంప్ వేసిన పరువు నష్టం దావాలో పుస్తక ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్‌తో పాటు న్యూయార్క్ టైమ్స్‌లో పనిచేసే నలుగురు జర్నలిస్టుల పేర్లు కూడా చేర్చారు. వీరిలో ఇద్దరు ట్రంప్ పై ఒక పుస్తకం రచించారు. ఈ పుస్తకాన్ని పెంగ్విన్ సంస్థ ప్రచురించింది. 'ఆ దావాలో పస లేదు' అని కోర్టులో ట్రంప్ దాఖలు చేసిన పరువు నష్టం దావా పై న్యూయార్క్ టైమ్స్ పత్రిక యాజమాన్యం స్పందించింది. ఆ దావాలో ఏ మాత్రం పసలేదని అది చెల్లదని న్యాయపరీక్షకు నిలువదని తేల్చి చెప్పింది. మీడియా స్వతంత్రతను దెబ్బతీయటమే ట్రంప్ ఉద్దేశమని విమర్శించింది. ప్రసార మాధ్యమాలను అణిచివేయడం మానుకోవాలని సూచించింది. ఇలాంటి చిల్లర బెదిరింపులకు తాము లొంగబోమని స్పష్టం చేసింది. నిజాలు నిర్భయంగా బహిర్గతం చేస్తూనే ఉంటామని, తమను ఎవరు అడ్డుకోలేరని పేర్కొంది. న్యాయం తను వైపే ఉందని ఉద్ఘాటించింది.

## జర్నలిస్టు లోకేష్ మృతి



చిత్తూరు జిల్లా పుంగనూరులో 10టివి మీడియాలో పనిచేస్తున్న కె.లోకేష్ ఆకస్మికంగా మరణించాడు. లోకేష్ మృతి స్థానికంగా ఉన్న జర్నలిస్టు మిత్రులందరికీ తీరని లోటు. లోకేష్ మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రకాష్‌రెడ్డి, సలీం, ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు కె.జయరాజ్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. లోకేష్ కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు.

## రైతు నేస్తం పురస్కారాల దరఖాస్తులకు ఆహ్వానం

రైతు నేస్తం 21వ వార్షికోత్సవం సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త దివంగత పద్మశ్రీ డాక్టర్ ఐ వి సుబ్బారావు పేరిట ఇచ్చే రైతు నేస్తం-2025 పురస్కారాలకు రైతు నేస్తం ఫౌండేషన్ దరఖాస్తులను ఆహ్వానించింది. పురస్కారాలకు దరఖాస్తు చేసుకునే వారు రైతు నేస్తం వెబ్‌సైట్ http://rythunestham.in/awards నుంచి అప్లికేషన్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ ఎడ్లపల్లి వెంకటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు పరిశోధనా వ్యాసాలు, సాగు అనుభవాలను జతపరిచి పంపాలని కోరారు దరఖాస్తులను ఎడిటర్ 6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్, ఖైరతాబాద్, హైదరాబాద్-500004 లేదా 9676797777 లేదా editor@rythunestham.in లో అందజేయాలని సూచించారు

# కాకినాడ ఈనాడు విలేకరిపై దాడి



కాకినాడలో ఈనాడు విలేకరిగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌పై దాడి జరిగింది. ఈ దాడిలో ఆయన గాయపడ్డారు. సెప్టెంబరు 14వ తేదీ రాత్రి విధినిర్వహణ ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. మాదకద్రవ్యాలు సేవించిన మైనర్ యువకులు ఈ దాడికి పాల్పడినట్టు తెలిసింది. మాదకద్రవ్యాల మత్తులో ఉన్న దుండగులు ఈ దాడికి పాల్పడినట్టు తెలిసింది. దాడిలో చంద్రశేఖర్‌కు ముఖంపై, ఛాతీపై గాయాలయ్యాయి. ఆయన చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. ఈనాడు విలేకరి చంద్రశేఖర్‌పై జరిగిన దాడిని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ తీవ్రంగా ఖండించింది.

**ఫెడరేషన్ ఖండన**

సుదీర్ఘకాలంగా కాకినాడ ఈనాడు విలేఖరిగా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ చంద్ర శేఖర్‌పై మాదకద్రవ్యాల మత్తులో ఉన్న కొందరు దుండగులు దాడి చేయడం అమానుషమని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్‌లు ఖండించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై అనేక వార్తలు, కథనాలు ఇస్తున్న చంద్రశేఖర్ పై కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగానే దాడి చేశారన్నారు. మద్యం, మాదకద్రవ్యాల మత్తులో ఉండి ఆరుగురు విచక్షణారహితంగా దాడి చేయడం శోచనీయమన్నారు. ముఖం, కాళ్ళు, చేతులపై గాయాలయి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రస్తుతం చంద్రశేఖర్ చికిత్స పొందుతున్నారన్నారు. పోలీసులు దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

**చికిత్స పొందుతున్న జర్నలిస్టుకు ఆర్థిక సహాయం**

గంజాయి మత్తులో కొందరు యువకుల దాడి చేయగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాకినాడ ఈనాడు విలేకరి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) నాయకులు సెప్టెంబర్ 16 ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. కాకినాడ అహోబిలం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్రశేఖర్ ను ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకత్వం పరామర్శించారు. జిల్లా కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు జి. శోభన్ బాబు, మీడియా సెక్రెటరీ పుర్రె త్రినాథ్, జిల్లా నాయకులు శ్రీధర్‌లు మాట్లాడుతూ చంద్రశేఖర్ పై దాడి అత్యంత హేయమైన చర్య అన్నారు. చంద్రశేఖర్ వంటి జర్నలిస్టులకే రక్షణ లేకపోతే మిగిలిన సామాన్యుల పరిస్థితి ఏమిటని ఈ సందర్భంగా వారు ప్రశ్నించారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై తక్షణ చర్యలు తీసుకుని రక్షణ కల్పించకుంటే ఆందోళన తీవ్రతరం చేయాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ హెచ్చరించింది.

## డిచ్‌పల్లి ఆంధ్రజ్యోతి విలేకరి నారాయణ మృతి



డిచ్‌పల్లి ఆంధ్రజ్యోతి రిపోర్టర్ లక్కవత్రి నారాయణ గుండెపోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం డిచ్‌పల్లి మండలం మిట్టపల్లి. స్నానం చేసేందుకు నీళ్లు పట్టుకుంటుండగా తీవ్ర గుండెపోటు రావడంతో హఠాన్మరణం చెందారు. నారాయణ మృతి పట్ల నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్టు తెలంగాణ శాఖ కన్వీనర్ ఎం.ఎ.రవూఫ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# వార్తాపత్రికలకు పెరుగుతున్న ఆదరణ

**ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్కులేషన్ వెల్లడ**

దేశంలో వార్తా దినపత్రికలకు ఆదరణ పెరిగిందని ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్కులేషన్ ఓ ప్రకటనలో తెలియజేసింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు నిర్వహించిన ఆడిటింగ్ వివరాల గణాంకాలను వెల్లడించింది. ఈ ఆరు నెలల్లో వార్త దినపత్రికల అమ్మకాల్లో ఆరోగ్యకరమైన పురోగతి కల్పించిందని తెలియజేసింది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు. 2,97,44,148 కాపీల అమ్మకాలు జరిగాయని వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలానికి 2,89,41,876 కాపీల అమ్మకాలు జరిగాయి గత ఏడాదితో పోలిస్తే మొత్తం 2.77% అధికమని 8,02,272 కాపీలు అధికంగా అమ్ముడు అయ్యాయని ఎబిసి తెలిపింది ఈ పురోగతి వార్తా దినపత్రికలపై పాఠకులకున్న నమ్మకాన్ని తెలియజేస్తుందని అభిప్రాయపడింది. అంతేకాదు విశ్వసనీయ ధృవీకరించిన లోతైన సమాచారం కోసం పాఠకులు వార్తా దినపత్రికలను చదువుతున్నారని వెల్లడించింది. దినపత్రికలు శక్తివంతమైన మాధ్యమంగా మారాయనడానికి సర్కులేషన్ పెరుగుదల నిదర్శనంగా నిలుస్తుందని తెలిపింది.

# సమాచార శాఖ ఎడికి అభినందన



జర్నలిస్టులతో ఒక అధికారిగా కాక మిత్రుడుగా వుంటూ సమర్ధవంతంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారని ఎడి గా ప్రమోషన్ పొందిన డి పి ఆర్ వో ఆర్ వి ఎస్ రామచంద్రరావు అభినందన సభలో ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్ డి జబీర్ ప్రశంసించారు. ఏలూరు జిల్లా పౌర సంబంధాధికారి రామచంద్ర రావు అసిస్టెంట్ డైరెక్టర్ (ఎ డి)గా ఉద్యోగోన్నతి పై రాజమండ్రి బదలీ అయిన సందర్భంగా ఆయనకు ఏపీ డబ్ల్యూ జె ఎఫ్ ఆధ్వర్యంలో అభినందన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. డి పి ఆర్ వో కార్యాలయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సమాచారశాఖ ఎడి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ సూర్య బ్యూరో ఇంచార్జి కె బాలశౌరి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జబీర్ రామచంద్రరావుకు మీడియాతో గల అనుబంధం గురించి వివరించారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె ఎస్ శంకర రావు గత ఇరవై ఏళ్లకు పైగా ఏపీ ఆర్ వో, డిపి ఆర్ వో గా జిల్లా కేంద్రంలో పని చేసిన రామచంద్రరావు నొప్పించక తానొవ్వక అన్న రితిలో ఫ్రెండ్లీ జాబ్ చేశారని కొనియాడారు. జిల్లా ఫెడరేషన్ కార్యదర్శి హరీష్ తనకు ఎంతో సహాయకారిగా గైడ్‌గా రాంచంద్రరావు సలహా సూచనలు ఇచ్చే వారని గుర్తు జేసుకున్నారు. చివరగా రామచంద్రరావు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఏలూరు జర్నలిస్టులు తనను ఏ నాడు ఉద్యోగిగా చూడలేదని పేర్కొన్నారు. అందరూ సొంత మనిషిగానే భావించి సహకారించారనితెలిపారు. వేరే జిల్లాకు వెళ్ళవలసిన తనని అప్పట్లో డి పి ఆర్ వో ఫ్రాన్సిస్ ఏలూరులో ఎ పి ఆర్ వో గా పోస్టింగ్ వేయించగా తాను ప్రమోషన్ వచ్చినా కొంత కాలం కృష్ణా జిల్లాకు వెళ్ళి తిరిగి ఇక్కడే జిల్లా అధికారిగా కొనసాగానని తెలిపారు. అది ఇక్కడ వారి మంచితనం, సహకారం మూలంగా అని ధన్యవాదాలు తెలిపారు. తన సొంత ఊరు రాజమండ్రని మరో ఎనిమిది నెలలు సర్వీస్ వుందని అక్కడే రిటైర్ అవుతానేమో నన్నారు. కార్యక్రమంలో ఏలూరు జిల్లా కార్యదర్శి హరీష్, జిల్లా ఉపాధ్యక్షులు కే సోమశేఖర్, ఎర్లీ పోస్ట్ ఎడిటర్ మిల్టన్ ప్రతాప్, చదలవాడ ప్రతాప్, సజ్జి మ్యాచెస్, వి నాగేశ్వరరావు కే కళ్యాణ్ శ్రావణ శ్రీనివాస్ సన్నీ మౌనిక, శరత్ కుమార్, సతీష్ కుమార్, దొరబాబు, వాసు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల హక్కులు - సమస్యల సాధన

ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభం అనబడే పాత్రికేయత, నేడు అత్యంత క్లిష్టమైన దశలో ఉంది. రాజకీయాలు, ఆర్థిక ప్రయోజనాలు, కార్పొరేట్ ఒత్తిడులు, సాంకేతిక పరిణామాలు – ఈ నాలుగు దిశలలో నుంచి జర్నలిస్టులపై అప్రతిహతమైన దాడులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల హక్కులు, వారి సమస్యలు, వాటి సాధన కోసం జరగాల్సిన పోరాటం అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

**జర్నలిస్టుల హక్కులు**

జర్నలిస్టులకు కేవలం "వార్త రాయడానికి స్వేచ్ఛ" మాత్రమే కాకుండా, ఆ వార్తను నిస్సందేహంగా ప్రచురించడానికి రక్షణ ఉండాలి. సత్యాన్ని వెలుగులోకి తెచ్చినందుకు ఎవరూ వేధింపులకు గురి కాకూడదు. సమాచార హక్కు ప్రజలకు ఎంత ముఖ్యమో, సత్యాన్ని బయటపెట్టే హక్కు జర్నలిస్టులకు అంతకంటే ముఖ్యమైంది. వారిని రక్షించడానికి చట్టపరమైన హామీ, వృత్తిపరమైన భద్రత, గౌరవప్రదమైన వేతనం తప్పనిసరి.

**సమస్యలు**

**రాజకీయ ఒత్తిడులు: నిజం రాసే జర్నలిస్టులు నేర కేసులు ఎదుర్కోవాల్సి వస్తోంది.**

**మీడియా యాజమాన్య నియంత్రణ: యజమానుల వ్యాపార ప్రయోజనాలకు వ్యతిరేకంగా రాయలేని పరిస్థితి.**

**ఆర్థిక అసమానతలు: చాలా మంది జర్నలిస్టులు కనీస వేతనాలు కూడా పొందలేక, కాంట్రాక్ట్ లేదా వేతన రహిత విధానాల్లో పనిచేస్తున్నారు.**

**జీవన భద్రత లేకపోవడం: దాడులు, బెదిరింపులు, హత్యలు కూడా ఎదుర్కోవాల్సి వస్తోంది.**

**ప్రెస్ ఫ్రీడం ఇండెక్స్ లో పడిపోతున్న స్థానం: భారతదేశంలో జర్నలిస్టుల స్వేచ్ఛ అంతర్జాతీయంగా కూడా ప్రశ్నార్థకమవుతోంది.**

**సాధన దిశ**

జర్నలిస్టుల సమస్యలు కేవలం వ్యక్తిగతం కాదు, అది ప్రజాస్వామ్యం బలహీనపడుతున్న సూచిక. అందుకే సాధన కూడా వ్యక్తిగత స్థాయి నుండి సామూహిక స్థాయికి మారాలి. జర్నలిస్టుల సంఘాలు మరింత బలంగా ఎదగాలి. సమస్యల పరిష్కారానికి విశాల ప్రాతిపదికపై పనిచేసేందుకు సిద్ధం కావాలి. అందుకు అవసరమైన రీతిలో కార్యాచరణ రూపొందించుకోవాలి.

చట్టపరమైన రక్షణ కోసం ఒత్తిడి తీసుకురావాలి, పాత్రికేయుల హక్కుల బిల్లును అమలు చేయించుకోవాలి.

సామాజిక మద్దతు అవసరం. ప్రజలకు ఇది కేవలం జర్నలిస్టుల సమస్య కాదని, వారి "సమాచార హక్కు" కోసం జరుగుతున్న పోరాటమని అర్థమయ్యేలా చేయాలి.



**పట్నాల సాయికుమార్**

డిజిటల్ మీడియా దిశలో పని చేసే జర్నలిస్టులకూ రక్షణ, గుర్తింపు ఇవ్వాలి. జర్నలిస్టులు కేవలం వృత్తి జీవనోపాధి కోసం కాదు, వారు ప్రజాస్వామ్యానికి కాపలాదారులు. వారి స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య స్వరానికి ఊపిరి. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించడం అంటే కేవలం వారి కోసం కాకుండా, ప్రజాస్వామ్యాన్ని బలపరచడం. ఈ పోరాటం ఆగకూడదు, తగ్గకూడదు. ఎందుకంటే "జర్నలిస్టు స్వేచ్ఛా రక్షణ లేకపోతే, ప్రజాస్వామ్యం కూలిపోవడం తప్పదని" చరిత్ర చెబుతోంది.

## ప్రెస్‌కౌన్సిల్ పేరు దుర్వినియోగం చేస్తే చర్య

కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా ఏ సంస్థ అయినా ప్రెస్ కౌన్సిల్ అనే పదాన్ని ఉపయోగించడం చట్ట ఉల్లంఘన పరిధిలోకి వస్తుందని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యదర్శి డాక్టర్ ధీరజ్ కకాడియా స్పష్టం చేశారు. ప్రెస్ కౌన్సిల్ లేదా దాని హిందీ సమానమైన అక్షరాలతో పేర్లను ఉపయోగించిన సంస్థలను నిషేధించడానికి లేదా చర్యలు తీసుకోవడానికి వీలుగా అన్ని రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిలకు ఆయన లేఖ రాశాడు. ప్రెస్ కౌన్సిల్‌కు ఏ రాష్ట్రంలోనూ ప్రత్యేకమైన శాఖలు సంస్థలు లేవని ఆయన స్పష్టం చేశారు.

# సమాచార వారధులు పేపర్ బాయ్స్



## వార్తాపత్రిక క్యారియర్స్ బాయ్స్ దినోత్సవం

ప్రజలకు వార్తలు చేరవేయడంలో జర్నలిస్టులు ఎంత కీలకమైన పాత్ర వహిస్తారో ఆ వార్తలు పాఠకులను చేరవేయడంలో పేపర్ బోయ్స్ అంతకు మించిన పాత్ర వహిస్తారు. నిద్రలేవగానే కాఫీ తాగడం తప్పనిసరి అని ఎలా అనుకుంటారో అదేవిధంగా రోజు తెల్లవారగానే దినపత్రికను చూసి ప్రపంచంలోని సమాచారం తెలుసుకోవడం అంతే ముఖ్యమనుకునేవారి సంఖ్య చాల ఎక్కువ. ప్రస్తుత డిజిటలైజేషన్ యుగంలో కూడా ప్రతిరోజు పేపర్ చదవనిదే రోజువారీ దినచర్య చాలామందికి మొదలుకాదు. అలాంటి పేపర్ ప్రియుల కోసం, అక్షర ప్రేమికుల కోసం ప్రతిరోజు తెల్లవారుజామునే లేచి ఆయా ప్రాంతాల నుంచి వాహనాల ద్వారా వచ్చే పేపర్ కట్టల వద్దకు చేరుకొని వివిధ రకాల పేపర్లను పంపిణీ కోసం సేకరించి వాటిని ఇంకా పొద్దు పొడవకముందే ఆ ఇళ్లకు చేరవేసినందుకు పనిచేస్తున్న పేపర్ క్యారియర్స్ బాయ్స్ పరిస్థితులను అందరూ గుర్తించాలి. ప్రతి సంవత్సరం జాతీయ వార్తాపత్రికల క్యారియర్స్ దినోత్సవాన్ని సెప్టెంబర్ 4వ తేదీన జరుపుకుంటారు. ఈ దినోత్సవం ఉదయాన్నే వార్తలను అందించే అందించేందుకు అంకితమైన క్యారియర్లను గౌరవించేందుకు చిహ్నంగా నిర్వహిస్తున్నారు. తెల్లవారుజామున కష్టపడి పని చేసి వార్తాపత్రికలను సకాలంలో వినియోగదారులకు చేరవేసే వారి సేవలను గుర్తించడం ఆరోజు ఉద్దేశం. ఇదే బెంజిమెన్ హెన్రీ దినోత్సవంగా గుర్తింపు పొందింది. ఒక అమెరికన్ వార్తాపత్రిక ప్రచురణ కర్త ఆయన 1833 సెప్టెంబర్ 4న యునైటెడ్ స్టేట్స్‌లో మొట్టమొదటి పెన్నీ ప్రెస్ వార్తాపత్రిక అయిన ది న్యూయార్క్ సన్ స్థాపించారు. వారు ప్రచురించే వార్తలను పేపర్ రూపంలో ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు పేపర్లు ప్రజలకు చేరవేసే యువకులు కావాలని గుర్తించారు. కాదా సెప్టెంబరు నాలుగున పదేళ్ల బార్నీ ఫ్లాహెర్టీ ప్రకటనకు సమాధానం ఇచ్చాడు. ఆ ప్రకటనలో ఈ పని కోసం స్థిరమైన పురుషులు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. అలా పని కోసం వచ్చిన ఫ్లా హెర్టీ పత్రికా యజమాని ఎంతగానో ఆకట్టుకున్నాడు. ఆ బాలుడు నిజాయితీ ఎంతగానో ఆకట్టుకోవడంతో పత్రికా యజమానికి అతనికి పేపర్ బాయ్ ఉద్యోగం ఇచ్చాడు.

**జాతీయ వార్తాపత్రిక క్యారియర్ దినోత్సవ చరిత్ర**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న తాజా వార్తలను పాత ఫ్యాషన్ ప్రింట్‌లో మీకు అందించడానికి ప్రతిరోజు వర్షాలు లేదా ఎండ చలి ఉన్నా పట్టింపు లేకుండా బయటకు వచ్చినందుకు మీ వార్తాపత్రిక క్యారియర్‌కు ధన్యవాదాలు చెప్పాల్సిందే.

న్యూయార్క్ నగరంలో మ్యూజియం ద్వారా యునైటెడ్ స్టేట్‌లో నియమితులైన మొదటి న్యూస్‌బాయ్ ప్రయత్నాలను గౌరవించడానికి నేషనల్ న్యూస్ పేపర్ క్యారియర్ డే సృష్టించారు. జేమ్స్ కాగ్ని, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, ఐజాక్ అసిమోవ్, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ వంటి వారు స్థానిక వార్తాపత్రికను తీసుకొని తమ జీవితాలను ప్రారంభించారు. అది ఇప్పటికీ అనేక స్థానిక సమాజాలలో యువకులు, మహిళలు నిర్వహించే మొదటి ఉద్యోగాలలో ఒకటిగా ఉంది. వారి పొరుగున ఉన్న ప్రజలకు వార్తలను అందించటానికి పేపర్ మార్గాలను నిర్వహించడానికి వారి బైక్‌లను ఉపయోగిస్తుంది. వారెన్ బఫెట్, జాన్ వేన్ వంటి వారితో సహా చరిత్రలో అత్యంత ప్రసిద్ధ వార్తాపత్రిక క్యారియర్లలో కొంతమందిని గుర్తించి 1960లో సృష్టించబడిన వార్తాపత్రిక క్యారియర్ హాల్ అఫ్ ఫేం కూడా ఉన్నది.

ఉదయం ఇంటి నుండి బయలుదేరి వార్తాపత్రికలను అమర్చటానికి పంపిణీ కోసం జాగ్రత్తగా ప్లాన్ చేయడానికి బయలుదేరే వేలాది

మంది పంపిణీదారులు ఉన్నారు. కొందరు తమ మోపెడ్లపై, ఎక్కువ మంది సైకిళ్లపై ఉంటారు. మన ఉదయాలను మెరుగుపరచటానికి వారు కలిగి ఉన్న అభిరుచికి మరింత విలువ ఇవ్వాలి. వారానికి ఒకసారి విరామం తీసుకోకుండా రోజూ తెల్లవారుజామున మేల్కొనే వారి కర్మయోగ సారాంశం ప్రశంసనీయం. పేపర్ పంపిణీదారులు తాము ఎదుర్కొంటున్న పేదరికం కోసం ఈ వృత్తిలోకి వస్తారని చాలామంది అభిప్రాయపడినప్పటికీ పేదరికాన్ని నివారించడానికి ఖచ్చితంగా అనేక ఇతర వృత్తుల ఉన్నాయి. అంకిత భావంతో పనిచేసే క్యారియర్ అబ్బాయిలు తమ వ్యక్తిగత కేరీర్‌లో కూడా చాలా దూరం వచ్చిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి క్యారియర్లు పంపిణీదారులుగా ఎదగడం, ఏజెన్సీని ప్రారంభించడం వారిలో ఎక్కువ మంది అబ్బాయిలను నియమించడం వంటి స్ఫూర్తి దాయకమైన కథలు ఉన్నాయి. ఈ క్యారియర్ బోయ్‌లకు యేడాదిలో వార్తాపత్రికలు ముద్రించబడని ఐదు ఆరు రోజులు మాత్రమే సెలవులుంటాయి. కోవిడ్ కాలంలో కోవిడ్-19 పుకార్లు వ్యాపించినప్పుడు కూడా వార్తాపత్రికల బోయ్స్ నిశ్శబ్దంగా తమ పనిని పూర్తి చేశారు. వార్తాపత్రిక ఇంటికి చేరలేదని ఒక్కరోజు కూడా ఎలాంటి ఫిర్యాదు లేదు. ఈ ఘనతకు వారిని కచ్చితంగా అభినందించాలి. ఈ-పేపర్లతో డిజిటల్ కమ్యూనికేషన్ యుగంలో ఉన్నప్పటికీ పేపర్ క్యారియర్ వ్యాపారం భౌతిక వార్తాపత్రికలను చదవడం ఎప్పటికీ తగ్గదని చాలామంది నమ్ముతారు.

**ఈ దినోత్సవ ఉద్దేశం**

ప్రస్తుత డిజిటలైజేషన్, యూట్యూబ్ న్యూస్‌ల ప్రభావం తీవ్రంగా ఉన్న తరుణంలో కూడా రోజువారీ వార్తాపత్రికలు చదవనివారు చాలామంది ఉన్నారు అనేది కాదనలేని నిజం. వార్తాపత్రిక క్యారియర్ల నిబద్ధతను గౌరవించడం, వారి సేవలను గుర్తించడం, వార్తాపత్రికలను సకాలంలో అందించి ప్రజలకు సమాచారాన్ని చేరవేసే వారి కృషిని గుర్తించడం. వర్షం లేదా ఎండతో సంబంధం లేకుండా తమ విధులను నిర్వర్తించే క్యారియర్లకు కృతజ్ఞతలు తెలియజేయడం అందరి బాధ్యతగా భావించాలి. పేదరికం, ఇల్లు గడవక, నిరక్షరాస్యత వంటి కారణాలవల్ల చాలామంది పిల్లలు పెద్దవారు ప్రతిరోజు ఉదయాన్నే పేపర్లు పంపిణీ చేసే పనిలో చేరుతారు. అటువంటి వారికి ఎండ, వాన, చలి అన్న ఉద్దేశం ఉండదు. బతుకు తెరువు కోసం ఎంతటి కష్టమైనా భరించేందుకు సిద్ధమయ్యే పనిలో చేరుతారు. ప్రపంచ విషయాలను పత్రికల్లో వార్తల ద్వారా ప్రజలకు అందజేసేందుకు వారు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞతలు తెలియజేయాల్సిందే. అందరికీ జాతీయ వార్తాపత్రికల క్యారియర్ దినోత్సవ శుభాకాంక్షలు.

# సమాచార శాఖ డిడి రమేష్‌కు అభినందనలు



గుంటూరు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా లోచర్ల రమేష్ సెప్టెంబరు 12న బాధ్యతలు స్వీకరించారు. పార్వతీపురం మన్యం జిల్లా సహాయ సంచాలకులుగా పనిచేస్తూ పదోన్నతి పొందిన రమేష్‌ను గుంటూరు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమిస్తూ సమాచార శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న శ్యామ్ కుమార్ నుండి బాధ్యతలు స్వీకరించారు. 1996 సంవత్సరంలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సహాయ పౌర సంబంధాల అధికారిగా ఎంపికై హైదరాబాద్, విశాఖపట్నం, పాడేరు, టెక్కలి, శ్రీకాకుళం, పార్వతీపురంలలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు పట్నాల సాయికుమార్, కార్యదర్శి మహేష్ వరదల శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

# చిత్తశుద్ధితో జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి




జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు అన్నారు. రాజమండ్రిలో సెప్టెంబరు రెండవ తేదీ తూర్పుగోదావరి జిల్లా సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాలలో పెన్షన్ సదుపాయం అమలవుతున్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో అమలు కావడం లేదని అన్నారు. జర్నలిస్టులకు అక్రిడేషన్లు సకాలంలో ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ పనిచేస్తున్నదని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకురావడానికి పలు రకాల కార్యక్రమాలను చేపట్టామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ఆయన వివరించారు. తూర్పుగోదావరి జిల్లాలో ఫెడరేషన్ బలంగా నిర్మించేందుకు వీలుగా ఫెడరేషన్ నాయకులు కృషి చేయాలని కోరారు. జిల్లా మహాసభల నిర్వహణకు సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి అన్ని నియోజకవర్గాల నుంచి ప్రతినిధులను ఆహ్వానించినందుకు నిర్వాహకులను ఆయన అభినందించారు.

**కన్వీనింగ్ కమిటీ ఏర్పాటు**

తూర్పుగోదావరి జిల్లా ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ కమిటీ ఏర్పాటయింది. ఈ కమిటీకి కన్వీనర్‌గా వెలుగూరి రవికుమార్, అన్ని నియోజకవర్గాల నుంచి సభ్యులను ఎన్నుకున్నారు. మొత్తం 15 మందితో కమిటీని నియమించారు. రాజమహేంద్రవరం అర్బన్ రూరల్ ఇన్చార్జిగా పోతుల వెంకటేష్, ఇతర నియోజకవర్గ కమిటీ సభ్యులుగా సిహెచ్ త్రినాథ్, ఎన్ రాంబాబు, శ్రీనివాసాచారి రమేష్ జీకే తదితరులు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

## శుభమస్తు సంపాదకుడు మృతి



విశాఖపట్నం జిల్లా గోపాలపట్నం కేంద్రంగా ప్రచురిస్తున్న శుభమస్తు పత్రిక సంపాదకులు బొడ్డేటి శ్రీనివాసరావు ఆకస్మికంగా సెప్టెంబర్ 8వ తేదీ మృతి చెందారు. పత్రిక ముద్రణ రంగంలో విశేష అనుభవం గల శ్రీనివాసరావు సౌమ్యుడుగా పేరు ఉంది, ఆకస్మికంగా ఛాతీలో నొప్పి రావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆయన చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖపట్నం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి నారాయణ్, జి శ్రీనివాసరావులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తమ సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.



# కార్మికులకు ఈ-శ్రమ్ కార్డ్

శ్రామికులకు వెన్నుదన్నుగా విపత్కర వేళ తోడుగా నిలిచేది ఈ శ్రమ కార్డు. అసంఘటితరంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్డు పొందడం పూర్తిగా ఉచితమైనా అవగాహన లోపం వల్ల చాలామంది ఈ ప్రయోజనాలకు దూరంగా ఉంటున్నారు. దర్జీలతో సహా చాలా రంగాలకు చెందిన శ్రామికులు ఈ-శ్రమ కార్డు పొందడానికి అర్హులు. నమోదు కూడా సులభం. ఈ-శ్రమలో నమోదైన కార్మికులు, వలస కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పలు ప్రయోజనాలు వర్తిస్తాయి. ఈ డేటా బేస్ ఆధారంగా ఉపాధి నైపుణ్యాభివృద్ధి కల్పిస్తారు. నిజంగా శ్రామికుల పాలిట ఈ-శ్రమ ఓ వరం వంటిదని చెప్పవచ్చు. కార్మిక శాఖ ఎంత కసరత్తు చేస్తున్నా ఇంకా పెద్ద సంఖ్యలో కార్మికులు ఈ శ్రమ కార్డు పొందడం లేదు. ఈ-శ్రమ్ నమోదు కోసం ప్రత్యేకంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

ఈ కార్డు ఎలా పొందాలి?

ఈ శ్రమ కార్డు పొందడం చాలా సులభం కంప్యూటర్ పై అవగాహన ఉన్న వాళ్లు ఈ-శ్రమ్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి సొంతంగా ప్రక్రియ పూర్తి చేయవచ్చు. సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్లు, మీసేవ, సిఎస్‌సి సెంటర్లలో వివరాలను నమోదు చేసుకుని కార్డు పొందవచ్చు. బ్యాంక్ అకౌంట్ నంబరు అకౌంట్‌కు లింక్ అయినా ఫోన్ నెంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆధార్ కార్డు, ఫోటో ఉంటే సరిపోతాయి. వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేసిన తర్వాత సెల్ నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. కార్డును ప్రింట్ తీసుకుంటే సరిపోతుంది.

అర్హులు ఎవరంటే?

అసంఘటితరంగానికి చెందిన కార్మికులు, వలస కార్మికులు, చిన్న సన్నకారు కౌలు రైతులు, కూలీలు, పశు పోషణ, వడ్రంగి, ఉప్పు తయారీ, ఇటుకబట్టీ, రాతి క్వారీ కార్మికులు, పని మనుషులు, క్షురకులు, కూరగాయలు, పండ్ల విక్రేతలు, చేతివృత్తులవారు, వీధి వ్యాపారులు, ఆశ అంగన్వాడి వర్కర్లు. టైలర్లు, మత్స్యకారులు, నర్సరీ కూలీలు, ఉపాధి కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, పాల వ్యాపారులు, కొరియర్ పేపర్ బాయ్స్, చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, రిక్షా కార్మికులు, సెరికల్చర్ హమాలీలు, హెూమ్ మెయిడ్స్, ఈఎస్ఐ. ఈపీఎఫ్‌లో సభ్యత్వం లేనివారు, ఆదాయ పన్ను పరిధిలో లేని వాళ్ళు అర్హులు. 16 నుంచి 59 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉండాలి. ఈ-శ్రమ్ కార్డులో ఈ విభిన్న వర్గాలవారిని విరివిగా చేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. అనేక చోట్ల ఇప్పటివరకు పలువురికి బీమా పరిహారం కూడా అందజేయడం జరిగింది. ఒక ఇంటిలో ఎంతమంది ఉన్నా ఈ పథకానికి అర్హులే. కార్మికుల పేర్ల నమోదుకు కామన్ సర్వీస్ సెంటర్లు, సచివాలయాల్లో నగదు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ-శ్రమ్ కార్డు అందించే లక్ష్యం త్వరలో చేరుకోవాలని ఆశిద్దాం.

# సమాచార శాఖలో పదోన్నతులు

సమాచార శాఖలో సహాయ సంచాలకులకు ఉపసంచాలకులుగా ప్రమోషన్లు కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. సహాయ సంచాలకుల నుంచి ఉపసంచాలకులుగా పదోన్నతులు పొందిన వారిలో పి వెంకటరాజు గౌడ్, ఎం భాస్కర నారాయణ, ఎన్ వేలాయుధం, వి వేణుగోపాల్ రెడ్డి. డి రమేష్, ఎల్ రమేష్‌లు ఉన్నారు.

# సోషల్ మీడియాపై ఆంక్షలతో నేపాల్‌లో సంక్షోభం

## కూలిన సర్కారు – కొత్త ప్రధాని సుశీల కర్కి




నేపాల్‌లో సోషల్ మీడియాపై విధించిన ఆంక్షలు దేశాన్ని సంక్షోభంలోకి నెట్టాయి. ప్రభుత్వం కూలిపోయింది. సోషల్ మీడియాపై విధించిన ఆంక్షల ప్రభావం నేపాల్ ప్రభుత్వాన్ని అతలాకుతలం చేసింది. ఈ ఆంక్షలకు తోడుగా అవినీతి ఆరోపణలు, వారసత్వ రాజకీయాలు కూడా తోడయ్యాయి. ఆందోళనకారులు సాగించిన నిరసనోద్యమం తీవ్రతరం కావడంతో దాదాపు 20 మంది చనిపోగా వందమందికి పైగా గాయపడ్డారు. పార్లమెంటు భవనంతో సహా పలు ప్రభుత్వ భవనాలకు ఆందోళనకారులు నిప్పటించారు. పరిస్థితి విషమించడంతో సోషల్ మీడియాపై పెట్టిన ఆంక్షలను తొలగించారు. తొలుత నేపాల్ హోంమంత్రి రాజీనామా చేశారు. ఆంక్షలు తొలిగించినప్పటికీ జెన్ పేరిట యువత సాగించిన ఆ ఉద్యమం తీవ్రతరం కావడంతో నేపాల్ ప్రధాని కెపి శర్మ ఓలి రాజీనామా చేశారు. నేపాల్ ప్రభుత్వ తాత్కాలిక ప్రధానిగా మాజీ చీఫ్ జస్టిస్ సుశీల కర్కి సెప్టెంబరు 13న పదవీ బాధ్యతలు స్వీకరించారు. సుశీల కర్కి నేపాల్ తొలి మహిళా ప్రధాని కావడం విశేషం. సోషల్ మీడియాపై ఆంక్షలతో మొదలైన ఆందోళన ప్రభుత్వాన్ని కూలదోసే వరకు రావడంపై అంతర్జాతీయ వ్యవహారాలను విశ్లేషించే నిపుణులు రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు. అవినీతి పట్ల వ్యతిరేకత, ప్రభుత్వంలో జవాబుదారీతనం, పారదర్శకత కోరుతూ ప్రత్యేకించి యువకులు, విద్యార్థులు జెన్–జడ్ పేరిట ఆందోళనలు సాగిస్తున్నారు. నిరుద్యోగం, ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళతున్న స్థితి యువకుల్లో ఆందోళన పెచ్చుపెరుగుతున్నందుకు కారణంగా భావిస్తున్నారు. దాదాపుగా యువత మొత్తంపై సోషల్ మీడియా ప్రభావం తీవ్రంగా ఉంది. సమాచార విస్ఫోటనం కలిగించే పరిణామాల ప్రభావానికి నేపాల్‌లోని పరిస్థితి ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

**ఆంక్షలకు దారితీసిన పరిస్థితులు**

నేపాల్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దేశంలోని సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలపై కఠిన చర్యలు తీసుకుంది. ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్, స్నాప్ చాట్‌తో సహా 26 సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లను నిషేధించింది. ఈ మేరకు ఆ దేశ కమ్యూనికేషన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా కంపెనీలు ప్రభుత్వం వద్ద అధికారికంగా రిజిస్టర్ చేసుకోవాల్సిన నిబంధనలను సరిగా పాటించలేదని తెలియజేసింది. ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోవడానికి గడువు సైతం ఇచ్చామని కానీ ఈ నియమాన్ని పాటించడంలో సదరు సంస్థలు విఫలమయ్యాయని పేర్కొంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలలో నకిలీ ఐడీలు కలిగిన యూజర్లు వాటిని ఉపయోగించి దేశాన్ని పుకార్లను వ్యాప్తి చేస్తున్నారని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇది సమాజంలో అశాంతికి దారితీస్తుందని తెలియజేసింది. నేపాల్‌లో విస్తృతంగా ఉపయోగించే ప్లాట్ ఫాంలకు నమోదు చేసుకోవాలని పదేపదే నోటీసులు ఇచ్చినా స్పందించలేదని మంత్రి పృథ్వీ సుబ్బా గురుగ్ తెలియజేశారు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిర్ణయం తర్వాత నేపాల్ లోని ఇంటర్నెట్ వినియోగదారులు ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, ఇన్‌స్టా ప్లాట్ ఫాంలకు యాక్సెస్ చేయలేకపోయారని పలు కథనాలు తెలియజేస్తున్నాయి.




# సీనియర్ సిటిజన్లకు ఎయిర్ ఇండియా సూపర్ ఆఫర్

దేశీయ విమానయాన సంస్థ ఏరియా సీనియర్ సిటిజన్లకు సూపర్ ఆఫర్ ఇచ్చింది. 60 సంవత్సరాలు, ఆపైన వయసు పైబడిన సీనియర్ సిటిజన్ ప్రయాణికులకు రాయితీలు ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణాలకు ఈ డిస్కౌంట్‌లో వర్తిస్తాయని పేర్కొంది.

విమాన టికెట్లపై గరిష్టంగా 25% వరకు రాయితీలు ఇస్తామని తెలియజేసింది. అయితే దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికులకు వేరువేరుగా ఈ సదుపాయం ఉంటుంది. దేశీయ మార్గాల్లో విమాన ప్రయాణాలు చేసే సీనియర్ సిటిజెన్లు ఫ్లైట్ టికెట్ ధరలో 25% తగ్గింపు పొందవచ్చు. ఇందుకోసం సీనియర్ సిటిజన్ ఆప్షన్ ఎంచుకొని డిస్కౌంట్ పొందవచ్చు. ఒకసారి తేదీ మార్చుకునేందుకు అవకాశం ఉంటుంది. 15 కిలోల వరకు అదనపు ప్యాకేజీ అనుమతిస్తారు. అలాగే ప్రోమో కోడ్ ఉపయోగించి యూపీఐ ద్వారా పేమెంట్లు చేస్తే దేశీయ అంతర్జాతీయ ప్రయాణాలలో ఒక్కో ప్రయాణికునికి అదనపు లబ్ధి చేకూరుతుంది.

ఎయిర్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ మొబైల్ యాప్ ద్వారా ఈ ప్రయోజనాలు పొందవచ్చు. అంతర్జాతీయ ప్రయాణాలకు సీనియర్ సిటిజెన్ స్కీం ద్వారా విమాన టికెట్ బేస్ ధరపై 10% రాయితీ ఇస్తున్నట్టు ఎయిర్ ఇండియా తెలిపింది. అకానమీ నుంచి ఫస్ట్ క్లాస్ వరకు అన్నిట్లో ఈ సదుపాయం వర్తిస్తుంది. ఒకసారి ప్రయాణం తేదీని మార్చుకోవచ్చు. అయితే చార్జీలు మారితే అదనపు చార్జి చెల్లించాలి. అలాగే 10 కేజీల వరకు అదనపు లగేజీ అనుమతిస్తారు. లేదా ఎకానమీ. ప్రీమియం ఎకానమీల్లో 23 కిలోలు ఉన్న రెండు బ్యాగులను తీసుకెళ్లవచ్చు. ఇక బిజినెస్ క్లాసులో వెళ్లాలనుకునేవారు 32 కిలోలు ఉన్న రెండు ప్యాకేజీలను తీసుకెళ్లవచ్చు. ఎయిర్ ఇండియా సిటీ లేదా ఎయిర్‌పోర్ట్ టికెట్ ఆఫీసులు, కస్టమర్ సపోర్ట్, ఎగ్జిక్యూటివ్. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్ మొబైల్ యాప్‌ల ద్వారా టికెట్లు కొనుగోలు చేయవచ్చు.

సీనియర్ సిటిజన్ ఆప్షన్ ఎంచుకొని డేట్ అఫ్ బర్త్ నిరూపించే ఫోటో ఐడి కార్డును చూపించాల్సి ఉంటుంది. టికెటింగ్, చెకింగ్, బోర్డింగ్ వంటి సమయాల్లో ఐడి కార్డును సమర్పించాల్సి ఉంటుంది. ఐడి కార్డులు లేకపోవడం, వయసు నిరూపించుకోలేకపోతే పెనాల్టీలు పడే అవకాశం ఉంటుంది. వన్ వే రిటర్న్ బుకింగ్‌నకు డిస్కౌంట్లు వర్తిస్తాయి. సీనియర్ సిటిజన్లకు కల్పించిన ఈ సదుపాయం వల్ల విమాన ప్రయాణీకులు ఎయిర్ ఇండియా వైపు మొగ్గు చూపే అవకాశాలు మరింతగా పెరుగుతాయి.

# జర్నలిస్టుకు ఆర్థిక సహాయం

రోడ్డు ప్రమాదానికి గురైె పిఠాపురంలో స్వతంత్ర ఛానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్న శివకృష్ణకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కాకినాడ జిల్లా శాఖ ఆర్థిక సహాయం చెక్కును అందజేసింది. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యుడు కె.సత్య తదితరులు బృందంగా వెళ్ళి ఫెడరేషన్ నుంచి ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఆగస్టు 30న పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి, కో ఆప్షన్ సభ్యులు గండేపల్లి బాబీ చేతుల మీదుగా ఈ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులు సంక్షేమ కోసం ఫెడరేషన్ నిరంతరం పని చేస్తోందన్నారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడే సంఘం సభ్యుల కోసం తగిన సహాయ సహకారాలు అందజేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ సభ్యులు, జర్నలిస్టులు కె.రాంబాబు, సత్య, జోజిబాబు, రామకృష్ణ, సువర్ణం మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు షణ్ముఖరావు ఆకస్మిక మృతి



శ్రీకాకుళం జిల్లా సారవకోట మండలం గొర్రిబంద గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పోతుమహంతి షణ్ముఖరావు ఎలియాస్ బాలు 2025,సెప్టెంబర్ నాలుగో తేదీన ఆకస్మికంగా మరణించారు. సుదీర్ఘకాలం ఆంధ్రజ్యోతి దినపత్రికలో పనిచేసి వేనోళ్ల కొనియాడబడ్డారు.జర్నలిజం విలువలను కాపాడుతూ నైతికత, నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచి అన్ని వర్గాల అభిమానాన్ని విశేషంగా చూరగొన్నారు. ప్రజా ప్రతినిధులు,రాజకీయ నాయకులు, ప్రభుత్వ,ప్రైవేట్ సంస్థల అధికారులు, సిబ్బంది మొదలుకొని సామాన్యుల వరకు షణ్ముఖరావు తన పని తీరుతో మెప్పించి అందరి ఆదరణను చూరగొన్నారు. జర్నలిస్టుగా తాను నమ్మిన సిద్ధాంతలకు, విలువలకు కట్టుబడి నిష్పక్షపాతంగా వార్తలు రాస్తూ అందరి ప్రశంసలు అందుకొన్నారు. ఆయన కొంతకాలం పాటు విజయ భాను దినపత్రికలోనూ, ప్రస్తుతం ఎరుక తెలుగు దినపత్రికలోనూ పనిచేస్తున్నారు. జర్నలిజం వృత్తికి షణ్ముఖరావు చేసిన సేవలకు గాను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ శ్రీకాకుళంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించింది. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు పి. పరమేశ్వరరావు కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్ శ్రీకాకుళం జిల్లా యూనిట్ అధ్యక్షులు సదాశివుని కృష్ణలు షణ్ముఖరావును ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.షణ్ముఖరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. షణ్ముఖరావు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర శాఖ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది.



# ఎర్రగొండపాలెం ప్రజాశక్తి విలేకరి మృతి

ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్న షేక్ వలి సాహెబ్ యాబై ఉండే పోటుతో సెప్టెంబర్ 4న మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఎర్రగొండపాలెం లోని ప్రజాశక్తి విలేకరిగా సుదీర్ఘకాలంగా ఆయన పనిచేస్తున్నారు. ఎన్నో ప్రజాసమస్యలపై తన కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చి వాటి పరిష్కారానికి కృషి చేశారు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ప్రకాశం జిల్లా నాయకులు జి నాగేశ్వరరావు, బ్రహ్మాంలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# అంబాజీపేట విలేకరి సోమేష్ మృతి



కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఆంధ్రావాయిస్, ఇమేజ్ మీడియా సంస్థలకు పనిచేస్తున్న దంగేటి సోమేశ్వరరావు సెప్టెంబరు 8న గడ్డిమందు తాగి మృతి చెందాడు. ఆయన సోదరుడు వెంకటేశ్వరరావు పోలీసులకు ఇచ్చిన సమాచారాన్ని బట్టి పెదపూడిలోని ఒక కొబ్బరితోటలో గడ్డిమందు సేవించిన సోమేష్‌ను కుటుంబసభ్యులు గమనించి వైద్యచికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కోనసీమ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.



రాజమండ్రిలో సెప్టెంబరు 2న జరిగిన తూర్పుగోదావరి జిల్లా మహాసభల సన్నాహక సమావేశంలో ఏర్పాటు చేసిన కన్వీనింగ్ కమిటీతో ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు

విశాఖపట్నం జర్నలిస్టు డి.రవికుమార్‌కు విజయవాడలో పూర్వ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్ చేతుల మీదుగా ఆగస్టు 30న జరిగిన ఎక్స్ రే అవార్డు ప్రదానం చేసిన దృశ్యం





రోడ్డు ప్రమాదంలో గాయపడిన పిఠాపురం స్వతంత్ర ఛానల్ రిపోర్టర్ శివకృష్ణకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ కాకినాడ జిల్లా శాఖ ఆర్థిక సహాయం చెక్కును అందజేస్తున్న దృశ్యం

పుంగనూరులో సెప్టెంబరు 9న జరిగిన చిత్తూరు జిల్లా ఫెడరేషన్ కార్యవర్గ సమావేశ దృశ్యం






## షణ్ముఖరావుకు నివాళి

శ్రీకాకుళంలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో పోతుమహంతి షణ్ముఖరావును ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్కరించిన దృశ్యం (పాతచిత్రం)

# నరువి హాస్పిటల్స్

## మీ భాగస్వామి
## ఆరోగ్యం మరియు వైద్యసేవలలో

**కరుణ మరియు శ్రద్ధ ద్వారా చెరగని బంధాలను ఏర్పరుస్తున్నది**

**500 - బెడ్ సూపర్ స్పెషాలిటి ఆసుపత్రి**

### పోల్చలేని నైపుణ్యం

- 25+ స్పెషాలిటీస్
  300+ ఇన్‌పేషెంట్ బెడ్స్
  100+ ఐసియు బెడ్స్
- 15 మాడ్యులార్ ఆపరేటింగ్ థియేటర్లు
- 3 టెస్లా ఎంఆర్ఐ 'ఇన్‌బోర్' అనుభవంతో
- డిస్కవరి ఐజిఎస్ 7 హైబ్రిడ్ ఓటి & కాథ్‌లాబ్
- ROSA న్యూరోసర్జికల్ రోబోట్ గైడెడ్ ఎపిలెప్సి సర్జరి
- ఎపిలెప్సి మానిటరింగ్ యూనిట్

### 24×7 సేవలు

- క్లినికల్ కేర్ మెడిసన్ & ఎమర్జెన్సీ
- ఇంటెన్సివ్ కార్డియాక్ కేర్
- పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్
- నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్
- రేడియాలజి & ల్యాబ్ సర్వీసెస్
- డయాలసిస్
- బ్లడ్ బ్యాంక్
- ఫార్మశి
- అంబులెన్స్ (మొబైల్ ఐసియు)





శ్రద్ధ యొక్క సుగంధం

www.naruvihospitals.com

**+91 416666 1111**
వేలూరు | తమిళనాడు

naruvi® HOSPITALS